సంచలన వార్తా పత్రిక
లీడర్
SANCHALANA VAARTHA PATRIKA LEADER

Read / Share / Follow
www.leaderepaper.com
www.facebook.com /leaderramanamurthy/
www.twitter.com /leaderramanamurthy/

సోమవారం • 26 మార్చి 2018 । సంపుటి : 20 సంచిక : 238 । ఎడిటర్ : వి.వి.రమణమూర్తి । 8 పేజీలు । వెల : రూ. 2.00
Published from Visakhapatnam, Rajahmundry and Hyderabad

'ప్రత్యేక' పాలనలో ఉద్యోగులదే రాజ్యం






జీవీఎంసీలో అవినీతి,అక్రమాలకు పెద్దపీట

ప్రశ్నించే పాలకవర్గం లేకపోవడంతో మరింత స్వేచ్ఛ

అభివృద్ధి అంటే హంగు, ఆర్భాటమేనా ?


కొరవడిన జవాబుదారీతనం

మేడి పండు మాదిరిగా "మహా"అభివృద్ధి

విశాఖపట్నం, న్యూస్‌లీడర్: వడ్డించేవాడు మనవాడైతే.. అన్నట్టుగా తయారైంది జీవీఎంసీ అధికారుల వ్యవహారం. పాలకవర్గం వుంటే వారికి జవాబుదారీగా వుండాలి.. అదే పాలనంతా మనమే చేస్తే ఇక అంతా మనదే. ఇదీ ఇక్కడి అధికారులు, ఉద్యోగుల తీరు.చిన్న,పెద్ద స్థాయిని మరచి ఏంచక్కా మిలాఖత్ అయిపోతే మనకు మించినవాడేలేడని పలువురు రుజువు చేశారు కూడా. ఏళ్లతరబడి ప్రత్యేకాధికారి పాలన సాగుతుండడంతో ఇక మహావిశాఖనగరపాలక సంస్థలో పనిచేస్తున్న పలువురు అధికారులు, సిబ్బంది పంట పండినట్టు అయింది. ఇప్పటికే జీవీఎంసీని బంగారు బాతులా భావించి వివిధ విభాగాల నుండి డిప్యూటేషన్‌లపై వచ్చిన వారే అధికం. ఇక్కడ పోస్టింగ్ కోసం పెద్ద ఎత్తున లాబీయింగ్ చేయడంతో పాటు లక్షలాది రూపాయలు ఖర్చుచేసినవారు కూడా లేకపోలేదు. అయితే "దీపం వుండగానే దేవుకోవాలన్న" నానుడిని తూచ తప్పకుండా పాటిస్తూ పలువురు జీవీఎంసీ

మిగతా 2లో ▶


కళ్యాణ వైభోగమే..



శ్రీ సీతారామకళ్యాణోత్సవం నగరంలోని అంబికాబాగ్‌లో శనివారం అధికారికంగా నిర్వహించారు. కనువిందుగా సాగిన ఈ ఉత్సవంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. మెగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. -విశాఖపట్నం, న్యూస్‌లీడర్

అమిత్‌షా లేఖకు అసెంబ్లీలోనే సమాధానమిచ్చా

ముఖ్యమంత్రి చంద్రబాబు



అమరావతి : బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా రాసిన లేఖకు అసెంబ్లీలోనే సమాధానం ఇచ్చానని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. సీఎం ఆదివారం టీడీపీ ఎంపీలు, మంత్రులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర ప్రజల మనోభావాలకు అనుగుణంగా అడగడం బీజేపీకి నచ్చడంలేదని అన్నారు. హోదా లేదంటూనే ఈశాన్య రాష్ట్రాలకు 90:10 నిధులు కొనసాగిస్తున్నారని, ఈశాన్య రాష్ట్రాలకు ఇచ్చేవన్నీ ఏపీకి ఇవ్వడం బీజేపీకి ఇష్టంలేదని చంద్రబాబు విమర్శించారు. ఆనాడు హోదా ఏ రాష్ట్రాలకు ఇవ్వడంలేదని, హోదాకు

మిగతా 2లో ▶

వల్లభనేని కృష్ణారావుకు ఏడాది జైలు

పురుషోత్తంపురం ఘటనపై న్యాయస్థానం తీర్పు



ఏ1 వల్లభనేని కృష్ణారావు

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : పదకొండేళ్ల క్రితం ల్యాండ్ మాఫియాకు నాయకత్వం వహించి దౌర్జన్యానికి పాల్పడ్డ వల్లభనేని కృష్ణారావుకు, మరో పదిమందికి ఏడాది జైలుశిక్ష విధిస్తూ ఇక్కడి ఆరవ ఏడీజే, మహిళాకోర్టు జడ్జి తీర్పునిచ్చారు. 2007లో పురుషోత్తమపురంలో జరిగిన ఈ సంఘటన సంచలనం కలిగించింది. జిల్లా పరిషత్ సమీపంలోని డాక్టర్స్ ప్లాజాలో నివాసం వుంటున్న వల్లభనేని కృష్ణారావు మరో పదమూడి మంది కిరాయి రౌడీలతో వచ్చి వివాదంలో వున్న భూమిలోకి చొరబడి గలాటా సృష్టించారని ప్రధాన ఆరోపణ. అప్పట్లో పెందుర్తి పోలీసులు వెంటనే స్పందించి నిందితుల్ని అరెస్టు చేశారు. అయితే ఈ పదకొండేళ్ల కాలంలో ఇందులో ముగ్గురు నిందితులు పులచెర్ల శ్రీనివాసరెడ్డి, బుద్దిరాజా రామ్మోహన్, కిశోర్‌లు మరణించారు. పెందుర్తికి సమీపంలోని పురుషోత్తమపురం సర్వేనెంబరు 49, 50లకు సంబంధించి వివాదం వుంది. ఇరువర్గాలూ కోర్టులను కూడా ఆశ్రయించాయి. అయితే బ్యాంకులో మాజీ ఉద్యోగి అయిన వల్లభనేని కృష్ణారావు 2007 సెప్టెంబరు 20వ తేదీన కొంతమంది కిరాయి రౌడీలను తీసుకువెళ్ళి ఈ స్థలంలో వున్న వాచ్‌మెన్ గోకాడ నాయుడు, రాజబాబు అక్కడే పనిచేస్తున్న మహిళ పార్వతిలపై దౌర్జన్యం చేశారు. అక్కడ అరటి తోటలను నరికివేసి భయానక వాతావరణాన్ని సృష్టించారు. దీంతో అప్పటి సీఐ నాయుడు తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి

మిగతా 2లో ▶

విజయనగరంలో కాల్పుల కలకలం

పోలీసు అదుపులో బొత్సా మోహన్



విజయనగరం, న్యూస్‌లీడర్ : విజయనగరం జిల్లా కేంద్రంలో కాల్పుల కలకలం చోటుచేసుకుంది. ఒకటో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో స్థిరాస్తి వ్యాపారి నమ్మి అప్పలరాజుపై పాత నేరస్థుడు బొత్స మోహన్ తుపాకీతో కాల్పులు జరిపాడు. శనివారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనలో అప్పలరాజుకు తీవ్ర గాయాలు కాగా విశాఖలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఒకటో పోలీసుస్టేషన్ పరిధి ఎల్ఐసీ భవనం పక్కన అప్పలరాజు కార్యాలయంలో ఉండగా.. మోహన్ తనతో పాటు తెచ్చుకున్న తుపాకీతో కాల్పులకు పాల్పడ్డాడు. ఆరు రౌండ్లు కాల్పులు జరపటంతో అప్పలరాజు తీవ్రంగా గాయపడ్డాడు. రక్తపు మడుగులో పడిఉన్న

మిగతా 2లో ▶

అంబేడ్కర్ కృషి మనకు స్ఫూర్తి

ప్రధాని నరేంద్రమోదీ



దిల్లీ: దేశ ప్రజలందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు చెబుతూ ప్రధాని నరేంద్రమోదీ ఆల్ ఇండియా రేడియోలో 'మన్ కీ బాత్' ద్వారా మాట్లాడారు. ఈ సందర్భంగా వ్యవసాయం, ఆరోగ్యం, పంటల గిట్టుబాటు ధరలు, యోగా తదితర అంశాల గురించి ఆయన ప్రస్తావించారు. సరికొత్త భారతావని సృష్టించడానికి దేశప్రజలందరూ సహకరించాల్సిందిగా ఆయన పిలుపునిచ్చారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్, జాతిపిత మహాత్మాగాంధీ ఆశయ సాధనల కోసం మన వంతు కృషి చేయాలని అన్నారు. మోదీ ప్రస్తావించిన పలు అంశాలు ఆయన మాటల్లోనే..

ఇటీవల జరిగిన గణతంత్ర దినోత్సవాలకు హాజరైన ఆసియాన్ దేశాల కళాకారులు రామాయణాన్ని ప్రదర్శించేందుకు ఆసక్తి చూపారు. రామాయణం మన దేశ ప్రజలకు మాత్రమే కాదు.. ఆసియన్ రీజియన్ వారికి కూడా స్ఫూర్తి. జయోగేశ్ భద్రేష అనే వ్యక్తి

మిగతా 2లో ▶


క్రికెటర్ మహ్మద్ షమీకి గాయాలు



డెహ్రాడూన్: రోడ్డు ప్రమాదంలో టీమిండియా క్రికెటర్ మహ్మద్ షమీ గాయపడ్డాడు. డెహ్రాడూన్ నుంచి ఢిల్లీ వస్తుండగా అతడు ప్రయాణిస్తున్న వాహనం ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో షమీ తలకు స్వల్ప గాయాలయ్యాయి. డెహ్రాడూన్‌లో చికిత్స తీసుకుని అక్కడే విశ్రాంతి తీసుకుంటున్నాడని సన్నిహితులు వెల్లడించారు. షమీ సురక్షితంగా

మిగతా 2లో ▶

ఐదు జిల్లాల్లో వడగాల్పులు



అప్రమత్తంగా ఉండాలని ఏపీ విపత్తుల నిర్వహణ శాఖ హెచ్చరిక

అమరావతి : ఎండలు మండిపోతున్నాయి. ఏప్రిల్ నెల ఇంకా రాక ముందే తెలుగు రాష్ట్రాలను ఉష్ణోగ్రతలు బెంబేలెత్తిస్తున్నాయి. ఇప్పటికే పలు చోట్ల 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఏపీలోని ఆదివారం ఐదు జిల్లాలలో వడగాలులు వీయవచ్చని చెప్పారు. గుంటూరు, ప్రకాశం, విశాఖపట్నం, కడప, కర్నూలు జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటే అవకాశం ఉందని తెలిపారు. అవసరమైతే తప్ప ప్రజలు ఎండలో బయటకు వెళ్లవద్దని, అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లినా, తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

మిగతా 2లో ▶

జగమేమాయ!



టిడిపితో కటీఫ్‌తర్వాత మనతో పొత్తులంటేనే ఎవరూ నమ్మేస్థితిలో లేరు. ఇక ఎంచుకోవడమొకటా..!

భారత మహిళల ప్రపంచ రికార్డు!

టీ20ల్లో రెండో అత్యధిక స్కోర్ నమోదు



ముంబై : అంతర్జాతీయ టీ20ల్లో భారత మహిళా జట్టు రికార్డు స్కోర్ నమోదు చేసింది. ముక్కోణపు టీ20 సిరీస్‌లో భాగంగా ఆదివారం ఇంగ్లండ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో 4 వికెట్లు కోల్పోయి198 పరుగుల భారీ స్కోర్ నమోదు చేసింది. మహిళల అంతర్జాతీయ

మిగతా 2లో ▶

సంచలన వార్తాపత్రిక
లీడర్
క్లాసిఫైడ్స్
విశాఖపట్నం | సోమవారం 26-3-2018

'ప్రత్యేక' పాలనలో ఉద్యోగులదే రాజ్యం

(మొదటిపేజీ తరువాయి)

ఉద్యోగులు అక్రమాల్లో తమ సత్తా చాటి చెబుతున్నారు.వారి లక్ష్యానికి మరింత ప్రోత్సాహంగా గత ఏడేళ్లుగా జీవీఎంసీ పాలకవర్గం కూడా లేకపోవడం, ప్రత్యేకాధికారి పాలన సాగు తుండడంతో ఇక ఇక్కడ అధికారులు, సిబ్బంది ఆడిందే ఆట, పాడిందే పాట అన్నట్టుగా మారింది. ఒక వైపు దినదినాభివృద్ధి చెందుతున్న మహానగరం స్మార్ట్ సిటీగా ఎంపిక కావడంతో పెద్ద ఎత్తున నిధులు వరదలా వస్తున్నప్పటికీ, ఆయా నిధులు వ్యయంలో పెద్ద ఎత్తున ధొల్లతనం కనిపిస్తోంది. ఆయా నిధులు సార్ధకమైన ఖర్చు చేయకుండా ఉన్నతాధికారులు సైతం హంగు, ఆర్భాటంకు పెద్దపీటవేస్తూ ప్రభుత్వ పెద్దల వద్ద గొప్పకోలుకు ప్రయత్నిస్తుండగా, కింది స్థాయి అధికారులు, సిబ్బంది దొరికినోడికి, దొరికినంత అంటూ ఎవరికీ వారే కాసుల వేటలో పడుతుండడం విచారకరం. దీంతో అభివృద్ధి చెందాల్సిన మహా నగరం ఒక వైపు నిర్లక్ష్యానికి గురికాగా, మరో వైపు అవినీతి అభివృద్ధికి అడ్డుగోడగా మారింది. దీంతో పెద్ద ఎత్తు నిధులు ఖర్చు జరుగుతున్నా జీవీఎంసీలో అనేక ప్రాంతాల్లో సమస్యలు సమస్యలుగానే మిగిలిపోతున్నాయి.

2005లో గ్రేటర్ విశాఖగా అవతరించిన జీవీఎంసీకి ఒక్కసారి మాత్రమే పాలకవర్గం ఎన్నికల జరగడం గమనార్హం. 2006లో పాలకవర్గం ఎన్నికలు జరిగాయి. పులుసు జనార్ధన్ రావు (కాంగ్రెస్) తొలి మేయర్‌గా వ్యవహరించారు. అయితే ఆయన పదవీ కాలం (ఐదేళ్లు) పూర్తయ్యాక,మరోసారి పాలక వర్గం ఎన్నికలు జరగలేదు.జీవీఎంసీలో భీమిలి, అనకాపల్లి మన్సిపాల్టీలు,పలు గ్రామాలు విలీనం విషయమై వివాదాలు, కోర్టు చిక్కులు తదితరాలుతో జీవీఎంసీ ఎన్నికలు వాయిదా పడుతూ వచ్చాయి. అయితే ఇప్పుడు ఆ ఇబ్బందులేవీ లేకపోయినా, ప్రభుత్వం మాత్రం రాజకీయ కారణాలతో ఎన్నికలు నిర్వహించేందుకు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. దీంతో దాదాపు ఏడేళ్లపాటు అధికారుల పాలన సాగుతోంది. దీంతో జీవీఎంసీలోని పలువురు అవినీతి అధికారులు, ఉద్యోగులు అవినీతికి మరింత స్వేచ్ఛ వచ్చినట్టు అయింది. గతంలో సాక్షాత్తూ జీవీఎంసీ కమిషనర్‌గా పనిచేసిన సత్యన్నారాయణపైనే నేరుగా అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇక ఆయన హయాంలో పలు విభాగాల అధికారులు సైతం పీకల్లోతు అవినీతి ఆరోపణలు ఎదుర్కోవడం ద్వారా జీవీఎంసీని కంపుకొట్టించేసిన విషయం విధితమే. అప్పట్లో అధికారులే ఒకరిపై ఒకరు బహిరంగంగా అవినీతి ఆరోపణలు చేసుకునే స్థాయికి వారి వ్యవహారాలు సాగాయి.ఇక ఆయన బదిలీపై వెళ్లినా జీవీఎంసీకి ఆ మరక పోలేదు. ఇక ఆ తరువాత కమిషనర్లు వచ్చినా, వారు సైతం ఇక్కడ పరిస్థితిని రూపుమాప లేకపోయారు. ముఖ్యంగా జీవీఎంసీలోని టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్, నీటిసరఫరా విభాగం,ప్రజారోగ్యశాఖ, యూసీడీ విభాగాల్లో అక్రమాలపై ఎప్పటి నుంచో ఆరోపణలున్నాయి. అయితే ప్రత్యేకాధికారి పాలనలో ఆయా విభాగాల్లో అవినీతి పెట్రేగిందన్న అనుమానాలు మరింత బలపరిచేలా ఇటీవల కాలంలో ఏసీబీ దాడుల్లో వెలుగుచూసిన పలువురు ఉద్యోగులు,అధికారుల అక్రమాల చిట్టాయే తేటతెల్లం చేస్తోంది. టౌన్‌ప్లానింగ్ విభాగానికి చెందిన పలువురు ఏసీపీలు, బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్లు, చైన్‌మెన్‌లు ఏపాటి అక్రమాస్తులు కూడబెట్టారో తెలిసిందే. నగరంలో అక్రమ భవన నిర్మాణాలు యధేచ్ఛగా సాగుతున్నాయి. పలు కాలువలు, రహదారుల నిర్మాణాల్లో కూడా పెద్దఎత్తున అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. నీటి సరఫరా విషయంలో కూడా సంబంధిత అధికారుల సహాయ, సహకారాలుతోనే అడ్డుగోలుగా వాటర్ ట్యాంకర్లు పక్కదారి పడుతున్నాయి. ఇక ప్రతీ పనికి చేతులు తడిపితే తప్పా, జీవీఎంసీలో ఫైల్ కదలదన్న ఆరోపణలున్నాయి. అన్ని విభాగాల్లో ఇదేతంతు కొనసాగుతోంది.వివిధ ప్రభుత్వ పథకాలు విషయంలో జీవీఎంసీ అధికారులు, కింది స్థాయి సిబ్బంది సైతం పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నప్పటికీ, అడిగే నాధుడే లేకపోవడం విచారకరం. జీవీఎంసీ ప్రత్యేకాధికారిగా పూర్వపు జీవీఎంసీ కమిషన్, ప్రస్తుత కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ సైతం జీవీఎంసీపై పూర్తిస్థాయిలో దృష్టిసారించడం లేదని తెలుస్తోంది. ఏదో నామ్‌కేవాస్తేగా ఆయన ప్రత్యేకాధికారిగా వ్యవహరిస్తూ వుండడంతో జీవీఎంసీలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడింది. కింది స్థాయి ఉద్యోగులు, అధికారులు మిలాఖత్ అయి అంతా కలిసి పంచుకుంటున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఫలితంగా నగరాభివృద్ధికి విఘాతం కలుగుతుండగా, మరో వైపు కోట్లాది రూపాయలు నిధులు పక్కదోవపడుతున్నాయి. అభివృద్ధి చెందుతున్న మహానగరాన్ని గాఢిలో పెట్టాల్సిన అవసరం ఎంతైనా వుందని, నిధులు సద్వినియోగం చేయడంతోపాటు, జీవీఎంసీలోని పలు విభాగాల్లో అవినీతి ప్రక్షాళన చేస్తేనే ఆశించిన అభివృద్ధి సాధించగలమని నగర ప్రజలు పేర్కొంటున్నారు.

క్రికెటర్ మహ్మద్ షమీకి గాయాలు

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నాడని, అతడి తలకు కుట్లు పడ్డాయని తెలిపారు. షమీ ప్రయాణిస్తున్న కారును ట్రక్కు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. భార్య హసీన్ జహాన్ ఆరోపణలు చేయడంతో వ్యక్తిగత జీవితంలో షమీ తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నాడు. తన భర్త స్త్రీలోలుడని, క్రికెట్‌లో ఫిక్సింగ్ పాల్పడ్డాడని షమీపై ఆరోపణలు చేసింది. తనను చిత్రహింసలు పెట్టాడని, హత్యాయత్నం కూడా చేశాడని వెల్లడించింది. మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలతో మొదట బీసీసీఐ కూడా కాంట్రాక్ట్ ఇవ్వవపోవడంతో మానసిక క్షోభ అనుభవించాడు. ఆరోపణల్లో నిజం లేదని తేలడంతో కాంట్రాక్టును బీసీసీఐ తర్వాత పునరుద్ధరించడంతో అతడికి ఊరట లభించింది.

వల్లభనేని కృష్ణారావుకు ఏడాది జైలు

(మొదటిపేజీ తరువాయి)

చేరుకొని దౌర్జన్యానికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి వారిని అరెస్టు చేశారు. ఈ కేసు విషయంలో న్యాయస్థానం పలు వాయిదాలు వేసిన అనంతరం తుది తీర్పు ఈ నెల 23 వతేదీన వెలువడింది. ఈమేరకు నిందితులు నేరం చేసినట్టుగా రుజువు కావడంతో వారికి వివిధ సెక్షన్లు కింద జైలు, జరిమానా విధించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడుగా వున్న వల్లభమనేని క్రిష్ణారావుతో పాటు ఎస్.కోటకు చెందిన రొబ్బి నాగరాజు, చింతలపాటి సత్యనారాయణరాజు, విశాఖలోని ఆరిలోవకు చెందిన బంగారి దుర్గా ప్రసాద్, పశ్చిమ గోదావరి జిల్లా ధర్మాజీగూడెంకు చెందిన లెక్కాలపు భాస్కరరావు, ఏలూరుకు చెందిన పిచుకుల శ్రీవెంకట త్రినాథ్ అలియాస్ త్రినాథ్, పాడిబాడిక ప్రసాద్, విజయనగరం జిల్లా ఎస్.కోటకు చెందిన కోరుపల్లి అప్పారావు, అరకువేలీకు చెందిన సిద్ధిగ రాజు, దాడి నాగేశ్వరరావు, సోవెరి శ్రీకాంత్‌లను దోషులుగా నిర్ధారించారు. ఈమేరకు కేసుకు సంబంధించిచ 11 నిందితులపై 354, 452 సెక్షన్‌లు 34 ఐపీఎస్ ప్రకారం 447 సెక్షన్ కింద మూడు నెలలు జైలు శిక్ష, రూ.500 జరిమానా, మరో సెక్షన్ 427 సెక్షన్ కింద వెయ్యి రూపాయలు జరిమానా ఏడాది జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు.

విజయనగరంలో కాల్పుల కలకలం

(మొదటిపేజీ తరువాయి)

అప్పలరాజును కార్యాలయ సిబ్బంది తొలుత స్థానిక తిరుమల ఆస్పత్రికి చేర్చారు. పరిస్థితి విషమంగా మారటంతో విశాఖకు తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఘటన జరిగిన తీరుపై కార్యాలయ సిబ్బంది నుంచి వివరాలు సేకరించారు. ఈ కేసుకు సంబంధించి విజయనగరం డీఎస్పీ రమణ మాట్లాడుతూ, నిందితుడు బొత్స మోహన్ విశాఖ జిల్లాకు చెందిన వాడని., స్థిరాస్తి వ్యాపార లావాదీవీల్లో భాగంగానే హత్యాకు పాల్పడినట్లు భావిస్తున్నామన్నారు. సంఘటనకు కారకుడైన బొత్సా మోమన్ పోలీసులు అదుపులో ఉన్నాడు. అయితే., ఈ ఘటన పట్టణంలో కలకలం రేపింది. విజయనగరంలో మొదటి సారి తుపాకీ కాల్పులు చోటుచేసుకోవడంపై పట్టణవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సమాధానమిచ్చా

(మొదటిపేజీ తరువాయి)

సమానంగా ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామంటేనే ఒప్పుకున్నామని ఆయన వివరించారు. హోదా ఎవరికీ ఇవ్వవద్దని ఆర్థికసంఘం చెప్పిందని కేంద్రం వక్రీకరించిందన్నారు. ఈఏపీలకు నిధులు ఇస్తామని చెప్పి కనీసం మెమో కూడా ఇవ్వలేదని, నాలుగేళ్లయ్యాక స్పెషల్ పర్పస్ వెహికల్ అంటున్నారని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. తొలి బడ్జెట్‌లోనే గొడవపడితే రాజకీయం అంటారనే ఉద్దేశంతోనే ఇన్నాళ్లు ఆగామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. కేంద్రం నుంచి నిధులు రాబట్టేందుకు అన్ని ప్రయత్నాలు చేశామని చెప్పారు. విధిలేని పరిస్థితుల్లోనే పోరుబాట పట్టామని ఆయన వివరించారు. బీజేపీ ఆరోపణలను తిప్పికొట్టాలని ఎంపీలు, మంత్రులు, కార్యకర్తలకు చంద్రబాబు సూచించారు.

ఐదు జిల్లాల్లో వడగాల్పులు

(మొదటిపేజీ తరువాయి)

40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే ప్రాంతాలు : విశాఖపట్నం - గూడెం కొత్తవీధి, కొయ్యూరు, గోలుగొండ, నాతవరం, నర్సీపట్నం, గుంటూరు: నిజాంపట్నం, ప్రకాశం: పెద్దారవీడు, కారంచేడు, చీరాల, వేటపాలెం, కొండపి, చినగంజాం, కడప: చింతకొమ్మదిన్నే, కడప, కర్నూలు: ఆత్మకూరు, శ్రీశైలం, పాములపాడు, ఉయ్యాలవాడ, కోయిలకుంట్ల

ఏపీకి కిరణ్ బేడీ, తెలంగాణకు సీవీఎస్‌కే శర్మ?

హైదరాబాద్ : ఏపీకి సంబంధించి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోబోతున్నట్టు తెలుస్తోంది. మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో, ఏపీకి పూర్తి స్థాయి గవర్నర్ ను నియమించే యోచనలో ఉంది. ప్రస్తుతం పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ గా ఉన్న కిరణ్ బేడీని ఏపీకి పంపాలనే యోచనలో కేంద్రం ఉన్నట్టు విశ్వసనీయ సమాచారం. తెలంగాణ గవర్నర్‌గా మాజీ ప్రిన్సిపల్ సెక్రటరీ సీవీఎస్కే శర్మ పేరు కూడా కేంద్రం ప్రతిపాదనలో ఉన్నట్టు తెలుస్తోంది. పార్లమెంటు సమావేశాలు పూర్తయిన వెంటనే ఏపీ, తెలంగాణలకు వేర్వేరుగా కొత్త గవర్నర్లను నియమించనుంది. ప్రస్తుతం ఇరు తెలుగు రాష్ట్రాలకు నరసింహన్ ఉమ్మడి గవర్నర్ గా వ్యవహరిస్తున్నారు. ఏపీకి కొత్త గవర్నర్ ను నియమించాలని ఇప్పటికే ఏపీ బీజేపీ నేతలు కేంద్రాన్ని కోరిన విషయం తెలిసిందే. ఇదే విషయంపై జనవరి 11న కేంద్ర హోం మంత్రి రాజ్ నాథ్ కు ఏపీ బీజేపీ అధ్యక్షుడు హరిబాబు లేఖ రాశారు. హైదరాబాదు నుంచి నరసింహన్ పని చేస్తుండటంతో... ఏపీకి ఆయన తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదనే అసంతృప్తితో ఏపీ ప్రజలు ఉన్నారని, ఏపీకి ప్రత్యేక గవర్నర్ ఉంటే బాగుంటుందనే విషయాన్ని ఆయన లేఖలో పేర్కొన్నారు. తాజాగా ఎన్డీయేకు టీడీపీ గుడ్ బై చెప్పిన నేపథ్యంలో, ఏపీ గవర్నర్ గా కిరణ్ బేడీనే సరైన ఛాయిస్ అని బీజేపీ అధిష్ఠానం భావిస్తున్నట్టు సమాచారం. ఏపీలో రాజ్ భవన్ లేకపోయినప్పటికీ... గవర్నర్ కు తాత్కాలికంగా సౌకర్యాలు కల్పించవచ్చని బీజేపీ నేతలు తమ హైకమాండ్‌కు చెప్పినట్టు తెలుస్తోంది.

భారత మహిళల ప్రపంచ రికార్డు!

(మొదటిపేజీ తరువాయి)

టీ20ల్లో ఇది రెండో అత్యధిక స్కోర్‌గా రికార్డుకెక్కింది. 2010లో నెదర్లాండ్స్‌పై దక్షిణాఫ్రికా 205/1 పరుగులతో ఈ జాబితాలో అగ్ర స్థానంలో ఉండగా ఆస్ట్రేలియా(191/3), న్యూజిలాండ్ (188/3), ఇంగ్లండ్ (187/5) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఈ ఏడాదే గత దక్షిణాఫ్రికా పర్యటనలో 168/3 పరుగుల స్కోరు చేసిన హర్మన్ ప్రీత్ సేన తాజా స్కోర్‌తో అధిగమించింది. ఇక భారత మహిళల బ్యాటింగ్‌లో స్మృతి మంధాన 76(40 బంతులు, 12 ఫోర్లు, 2 సిక్సర్లు) వేగవంతమైన హాఫ్‌సెంచరీకి తోడు మిథాలీ రాజ్ 53(43 బంతుల్లో 7 ఫోర్లు) రాణించడంతో భారీ స్కోరు నమోదైంది.

అంబేడ్కర్ కృషి మనకు స్ఫూర్తి

(మొదటిపేజీ తరువాయి)

యువత ఆరోగ్యం గురించి మన్ కీ బాత్‌లో ప్రస్తావించాల్సిందిగా కోరారు. అందుకే నేను ఫిట్ ఇండియా గురించి మాట్లాడాలని నిర్ణయించుకున్నాను. యువత తమ ఆరోగ్యాన్ని ఫిట్‌గా ఉంచుకునేందుకు ఫిట్ ఇండియా ఉద్యమాన్ని ప్రారంభించాలి. 'ఎగ్జామ్ వారియర్' (రచయిత మోదీ) పుస్తకానికి వచ్చిన స్పందన నా హృదయాన్ని తాకింది. అసోంలోని కరీంజంగ్ ప్రాంతానికి చెందిన రిక్షా తొక్కే వ్యక్తి అహ్మద్ అలీ. పేద చిన్నారుల కోసం ఆయన తన కష్టార్జితంతో తొమ్మిది పాఠశాలలను కట్టించారు. భారతీయుడి శక్తి ఏమిటనేది ఆయన నిరూపించి ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారు.

13ఏళ్ల క్రితం కోల్‌కతాకు చెందిన క్యాబ్ డ్రైవర్ సైదుల్ లష్కర్ అనే వ్యక్తి సోదరికి సరైన సమయానికి వైద్యం అందక మరణించింది. తన సోదరికి ఎదురైన పరిస్థితి మరెవరికీ ఎదురు కాకూడదని భావించిన ఆయన పేద ప్రజలకు హాస్పిటల్ కట్టించాలని నిర్ణయిం చుకున్నారు. అందుకోసం సైదుల్ తన ఇంట్లోని బంగారాన్ని అమ్మేశారు. విరాళాలు సేకరించారు. అలా సేకరించిన నగదుతో పన్నెండేళ్ల తర్వాత కోల్‌కతాలోని పుద్రి గ్రామంలో ఆయన 30 పడకల ఆస్పత్రిని కట్టించారు. ఇదే న్యూఇండియా శక్తి. నాకు కాన్పూర్‌కు చెందిన డా. అజిత్ మోహన్ చౌదరి గురించి తెలిసింది. ఫుట్‌పాత్‌ల మీద ఉండే నిరుపేదలకు ఆయన చికిత్స చేసేందుకు వెళ్తారు. వాళ్లకు మందులు ఇస్తారు. ఆయన గురించి చెప్పేందుకు ఎంతో గర్వపడుతు న్నాను. దేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం ఎంతో ప్రాముఖ్యమైనదని మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి వంటి వాళ్లు చెబుతూ ఉంటారు. దేశానికి వెన్నె ముక లాంటి వారి సంక్షేమమే ధ్యేయంగా ఈ ఏడాది బడ్జెట్‌ను ప్రవేశపెట్టాం. పంటకు తగిన గిట్టుబాటు ధర అందేలా చేసేందుకు కృషి చేస్తాం. ఈ ఏడాది మహాత్మాగాంధీ 150వ జయంతి. ఆయన ఆశయం ప్రకారమే స్వచ్ఛభారత్‌ను నిర్మిస్తున్నాం. ఆయనకు ఘనమైన నివాళి ఇచ్చే విధంగా ఉండే సలహాలు, సూచనలు ఏమైనా ఉంటే మాతో పంచుకోండి.

పేద ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం పథకాలను తీసుకొస్తోంది. 3000 జన్ ఔషధి కేంద్రాల ద్వారా సరైన ధరలకే 800 రకాల మందులు ప్రజలకు అందేలా చూస్తున్నాం. మోకాలి శస్త్రచికిత్స ధరను 50-70 శాతానికి తగ్గించాం. ఆయుష్మాన్ భారత్ కింద 10కోట్ల కుటుంబాలకు ఏడాదికి రూ.5లక్షల చొప్పున బీమా అందేలా పథకాన్ని తీసుకొచ్చాం. 1930-40 సంవత్సర మధ్య కాలంలో ప్రపంచమంతా రెండో ప్రపంచ యుద్ధం, విభజన, ప్రచ్ఛన్న యుద్ధం గురించి మాట్లాడుకున్నారు. కానీ ఒక వ్యక్తి మాత్రం ఐక్యత గురించి మాట్లాడారు. ఆయనే రాజ్యాంగ నిర్మాత డా. అంబేడ్కర్. ఆశయ సాధన కోసం ఆయన చేసిన కృషిని స్ఫూర్తిగా తీసుకోవాలి. ఆయన జయంతికి నివాళిగా గ్రామ స్వరాజ్ అభియాన్‌ను దేశమంతా ఏప్రిల్ 14 నుంచి మే 5 వరకు నిర్వహించాలి. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని.. యోగా పట్ల అవగాహన కలిగేలా ప్రచార కార్యక్రమాలను నిర్వహించాలి. యోగా వల్ల ఫిట్‌గా ఉండటమే కాదు.. ఆరోగ్యంగా కూడా ఉంటాం.

ఐసెట్, ఆసెట్, ఎంసెట్‌లలో ఉచిత శిక్షణ

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : శ్రీసత్యసాయి ఉజ్వల్ జీవన్ పథకంలో భాగంగా ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఐసెట్, ఆసెట్, ఎంసెట్ ప్రవేశ పరీక్షల్లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు సంస్థ జిల్లా అధ్యక్షుడు వీఆర్.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత శిక్షణ తరగతులు పోర్టు స్టేడియం ఎదురుగా గల సత్యసాయి వీధిలోని సాయిగోదల్ జరుగుతాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఏప్రిల్ 8లోగా http://studentcorner.tech/sssuj వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

హామీలు కన్నా ఎక్కువే అమలు చేశాం

టీడీపీ వైఖరి విడనాడి రాష్ట్రాభివృద్ధికి తోడ్పడాలి

బీజేపీ నగర అధ్యక్షుడు నాగేంద్ర



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాగేంద్ర

దాబాగార్డెన్స్, న్యూస్‌లీడర్: రాష్ట్ర విభజన హామీలు ఒక్కొక్కటిగా నెరవేర్చుతున్నప్పటికీ టీడీపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రం ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని బీజేపీ నగర అధ్యక్షుడు ఎం. నాగేంద్ర అన్నారు. భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంకు సంబంధించి 2015లో అప్పటి కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి స్మృతి ఇరానీ భూమి పూజ చేసిన తర్వాత ఐఐఎం బెంగుళూరు సంస్థ పర్యవేక్షణలో ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని తాత్కాలిక ప్రాంగణంలో అన్ని వసతులతో ఆగష్టు 2015 నుండి తరగతులు ప్రారంభించడం జరిగిందన్నారు. కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ ద్వారా ఏప్రిల్ 2016 22న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ సొసైటీ రిజిస్టర్ చేయబడిందన్నారు. ఐఐటీ ఖరగ్‌పూర్ పర్యవేక్షణలో తరగతులను కూడా ప్రారంభించడం జరిగిందన్నారు. విశాఖపట్నం విమానాశ్రయం అభివృద్ధి కేంద్రం ఎంతగానో కృషి చేసి అంతర్జాతీయ విమానాశ్రయంగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. 2015లో 6 వేలుతో ఉన్న వాటిని రూ. 35కోట్లతో మరో 6 అనగా 12 వేలు పార్కింగ్ సదుపాయాలు కల్పించిందన్నారు. రూ.55 కోట్లతో టెర్మినల్ పొడిగింపు పనులు తుది దశకు చేరుకున్నాయని గుర్తుచేశారు. హెచ్‌పీసీఎల్ అభివృద్ధితో పాటు రాష్ట్ర విభజన చట్టం 2014కు అదనంగా విశాఖలో అనేక సంస్థలు ఏర్పాటు ప్రాజెక్టులు అందించడం జరిగిందని వెల్లడించారు. విశాఖ మెంటల్ ఆసుపత్రి కు సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ గా గుర్తింపునిచ్చారన్నారు. మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కు విభజన చట్టంలో లేకపోయిన కేటాయించిందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఎగుమతి తనిఖీ మండలి పరీక్ష ప్రయోగశాల తదితర అంశాలు అను కేటాయించి పూర్తి దశకు చేరుకుంటున్నాయని తెలిపారు. కేంద్రం ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ప్రజలకు తప్పుదారి పట్టించేవిధంగా విమర్శలు చేయడం తగదన్నారు. ఇప్పటికైనా మంత్రులు, ఎమ్మెల్యేలు నాయకులు కేంద్రంపై విమర్శలు విడనాడి అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు నారాయణ రావు, మళ్ళ వెంకట్రావ్, సంతోష్ కుమార్, పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. కల్యాణోత్సవం

- నగరంలో పలుఆలయాల్లో అంబరాన్నంటిన సంబరాలు
- తెల్లవారుసుండే ప్రత్యేక అభిషేకాలు, పూజలు
- ఆదర్శదంపతులను దర్శించుకున్న అశేష భక్త జనం



అంబికాబాగ్‌లో ఉత్సవ మూర్తులకు కల్యాణం చేస్తున్న దృశ్యం

దాబాగార్డెన్స్, న్యూస్‌లీడర్: భక్తుల రామనామ స్మరణ.. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ సీతారాముల కల్యాణ వేడుకను నేత్రపర్వంగా నిర్వహించారు. బుగ్గన చుక్క పెట్టుకున్న జగదభిరాముడు సీతమ్మను మనువాడారు.. జీలకర్ర బెల్లం తలపై పెట్టారు.. తాళిబొట్టు కట్టారు. మెడలో కల్యాణమాల వేశారు.. ముత్యాల తలంబ్రాలు చల్లుకుని మురిసిపోయారు. పెళ్లి తంతు జరుగుతున్నంత సేపు భక్తులు ఆ ఆదర్శ దంపతులను తిలకించారు. నగరంలోని శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. లోకకల్యాణార్థం మానవరూపంలో అవతరించిన మహావిష్ణువు దశావతారాల్లో ఒకటైన శ్రీసీతారాముల కల్యాణం నగరంలో ఆదివారం పలుచోట్ల అంగరంగ వైభవంగా జరిగాయి. అందాల రాముడు, సౌభాగ్యవతి సీతను ఏకం చేసే ఈ పండుగను భక్తులు వీక్షించేవిధంగా పలు ఆలయాల్లో నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. తెల్లవారుజామునుండే స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. శ్రీ కనకమహాలక్ష్మి దేవస్థానం దత్తత ఆలయమైన జగదాంబ జంక్షన్ దరి అంబికా బాగ్ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో సీతారామకల్యాణం అత్యంత వైభోవపేతంగా నిర్వహించారు. అలాగే సీతమ్మధార క్షత్రియ కల్యాణ మండపం, టీటీడీ కాలనీ బృందావన్ పార్కు, దొండపర్తి వరదేశమ్మ వారి దేవస్థానం శ్రీరామ మందిరం, తదితర ఆలయాల్లో శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవాల్లో భక్తులు పాల్గొని పరవశించారు. అమ్మవారికి, స్వామికి కల్యాణం చేసే వేడుక చూసేందుకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. రామాలయం నందు ఆదివారం ఉదయం శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణం అనంతరం అదే మధ్యాహ్నం 12గంటల నుండి భారీ అన్నసమారాధన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సాయి ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవాలు సందర్భంగా ఆదివారం సాయంత్రంపలు చోట్ల శ్రీరామనామ సంకీర్తన, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. శ్రీఅభయాంజనేయస్వామి ఆలయాల్లో వద్ద సోమవారం మధ్యాహ్నం 12గంటలకు శ్రీసీతారాములవారి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆలయవర్గాలు కోరారు. శ్రీగౌరీపరమేశ్వరుల ఆలయం, సాయిబాబా ఆలయాల్లో కూడా శ్రీసీతా రాముల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

ఎన్ఏడీ జంక్షన్‌లో

శ్రీ సీతారామస్వాముల వారిని దర్శించేందుకు ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆదివారం ఉదయం మూలవిరాట్‌కు అభిషేక మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకను చూసేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. క్యూలైన్లు, ప్రసాదాల కౌంటర్లు కిటకిటలాడాయి. సుదూర ప్రాంతాల నుంచి పాదయాత్రగా వచ్చిన భక్తులు ఉచిత దర్శనం వద్ద గంటల తరబడి వేచిచూడాల్సి వచ్చింది. స్థానిక జీవీఎంసీ 67 వార్డ్ బాజీరాజుపాలెం రెడ్డి వీధి, గవరవీధి, మర్రిపాలెం, మాదవధారా కంచరపాలెం, తదితర ప్రాంతాల్లో శ్రీరామ నవమి సందర్భంగా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే వందలాది మంది పోలీసులు బందోబస్తులో నిమగ్నమయ్యారు. కల్యాణం అనంతరం ముత్యాల తలంబ్రాలను భక్తులకు పంపిణీ చేసారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో వార్డ్ వైస్సార్సీపీ అధ్యక్షుడు చుక్క ప్రసాద్ రెడ్డి, నమ్మి శ్రీను, పూలెడ్డి పైడిరెడ్డి, ఈశ్వర రెడ్డి (బ్యాంకు) చక్రవర్తి రెడ్డి, సూర రెడ్డి, కృష్ణారెడ్డి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు

గాజువాకలో...

శ్రీరామ నవమిని గాజువాకలో భక్తులు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉదయం నుండే హనుమాన్ దేవాలయాలతో పాటుగా రామాలయాలు భక్తులతో కిటకిటలాడగా స్థానికులు పుర వీధుల్లో కల్యాణ వేదికలు నిర్వహించి శ్రీరాముని కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధానంగా స్థానిక సంజీవ కాలనీలో మాజీ మేయర్ పులుసు జనార్దనరావు దంపతులు శ్రీరామ కల్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అభివృద్ధికమిటీ చైర్మన్ కొత్తపల్లి ప్రభావతి, కార్యవర్గ సభ్యులు పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీనగర్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన శ్రీరామ కల్యాణ మహోత్సవ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు చింతలపూడి వెంకట్రామయ్య దంపతులు పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 50వ వార్డు పరిధిలో జిల్లా తెదెపా నాయకులు దొడ్డిరమణ దంపతుల ఆధ్వర్యంలో శ్రీరామ కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు పలు ప్రాంతాల్లో అన్నసమారాధనా కార్యక్రమాలు నిర్వహించారు.



అంబికాబాగ్‌లో..



ఎన్ఏడీ కొత్తరోడ్డులో...



గాజువాకలో..

బాధితుల్ని ఆదుకుంటాం

శ్మశాన వాటికకు స్థలం కేటాయిస్తాం

ఎమ్మెల్యే వాసుపల్లి



బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి

విశాఖపట్నం,న్యూస్‌లీడర్: అంగడిదిబ్బ బాధితుల్ని ఆదుకుంటామని ప్రభుత్వం తరుపున సహాయ చర్యలు తీసుకుంటామని స్థానిక ఎంఎల్ఏ వాసుపల్లి గణేష్ కుమార్ తెలిపారు. నగరంలో 20వ వార్డులో ఉన్న అంగడి దిబ్బ శ్మశానవాటిక సమస్య రెండు వర్గాల మధ్య ఘర్షణ, ఇళ్ళు కూల్చేయడం, పోలీసుకేసులు నమోదు వంటి గత రెండురోజులుగా జరుగుతున్న విషయాలు విదితమే. ఈక్రమంలో ఆదివారం స్థానిక ఎంఎల్ఏ బాధితుల్ని పరామర్శించి ఇరువర్గాల ఘర్షణ నేపథ్యంలో కూల్చివేయబడిన ఇళ్ళను సందర్శించారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది సున్నితమైన సమస్యని చర్చల ద్వారా సమస్య పరిష్కారమవుతుందన్నారు. ఇరువర్గాలు దౌర్జన్యాలకు పాల్పడవద్దని సూచించారు. ముస్లిం సోదరులకు శ్మశానవాటిక సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి నగరంలో 10ఎకరాల స్థలాన్ని కేటాయించనున్నట్లు హామీ ఇచ్చారు. అదేవిధంగా ఎంతోకాలంగా స్థానికంగా నివాసముంటున్న 460 కుటుంబాల వారికి ఇళ్ళ పట్టాలు మంజూరు చేస్తామన్నారు. ముందుగా ఒక వర్గానికి చెందిన వారికి శ్మశాన వాటికకు స్థలం కేటాయించిన అనంతరం మాత్రమే స్థానికులకు ఇళ్ళ పట్టాలు మంజూరు చేస్తామని తెలపడంతో గొడవ సద్దుమణిగింది. ఇరువర్గాల అంగీకారంతో ఎంఎల్ఏ సమస్యను పరిష్కరించారు. ఈకార్యక్రమంలో ఇరువర్గాల పెద్దలు ఎంఎల్ఏ వెంట ఉన్నారు.

మహిళలను గౌరవించాలి

వాసవీ క్లబ్ డిప్యూటీ గవర్నర్ కందుల నాగరాజు



జ్ఞాపికను అందజేస్తున్న కందుల నాగరాజు

దాబాగార్డెన్స్,న్యూస్‌లీడర్: మగవారితో సమానంగా సమాజంలో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్న మహిళలను గౌరవించుకునే దిశగా వనితా వైభవ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని వాసవీ క్లబ్ డిస్ట్రిక్ట్ పీఆర్ఓ, డిప్యూటీ గవర్నర్ కందుల నాగరాజు అన్నారు. ఒకటవ పట్టణ పరిధిలో గల ఆర్యవైశ్య యువజన సంఘం కార్యాలయంలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మహిళా ఆర్కిటెక్టును, న్యూట్రీషన్‌తో పాటు, పలు రంగాల్లో ప్రగతి సాధించిన మహిళలను సన్మానించి మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిల్వర్ హౌస్ విన్నర్ వి. విందుమతి గుప్తా నిలిచారు. కార్యక్రమంలో శ్రీరామమూర్తి, కంకటాల ప్రభాకర్, సల్లూరి సూరరాజు, ముక్కు శ్రీనివాసరావు, పూసర్ల బంగారు శెట్టి, జోన్ ఛైర్మన్ రామకృష్ణ, అధ్యక్షుడు వై. హరినాథ్, ప్రధాన కార్యదర్శి వి. సూర్య ప్రకాష్, డి. సోమేష్ రావు, పాలూరి శేషుమాంబ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారామ కల్యాణం

ఆరిలోవ న్యూస్ లీడర్ : దినగదిలి నార్త్ షిరిడి సాయి బాబా ఆలయంలో ఆదివారం సీతారామ కల్యాణ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగింది. గాజువాక జి.వి.ఎం.సి జోనల్ కమీషనర్ సోమన్నారాయణ దంపతులు ప్రథమ దంపతులుగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో 200 మంది దంపతులు పాల్గొని వివాహ మహోత్సవంలో పాలుపంచు కున్నారు. ఆలయ ప్రధాన కార్యదర్శి వానపల్లి అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో వేదపండితులు నగేష్ శర్మ, చైతన్య శర్మ వివాహ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులు విందు భోజనంలో పాల్గొన్నారు. ఆదర్శనగర్ రామాలయంలో కూడా ఈ వేడుకలు జరిగాయి.



షిరిడి సాయి ఆలయంలో సీతారామ కల్యాణం చేస్తున్న దృశ్యం

చంద్రన్న బీమా పంపిణీ

ఎన్ఏడి, న్యూస్‌లీడర్: చంద్రన్న బీమా పరిహారం పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ మేరకు ఇటీవల అనారోగ్యం కారణంగా మృతి చెందిన స్థానిక జీవీఎంసీ 67 వ వార్డు విమాన నగర్‌కి చెందిన సువ్వాడ జయ వెంకట సూర్యనారాయణ (48) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ మేరకు ఆయన కుటుంబ సభ్యులకు ప్రధాన మంత్రి చంద్రన్న బీమా పరిహారం కింద 5 వేలరూపాయలను ఆతడి బంధువులకి బీమా మిత్ర సభ్యురాలు గుమ్మడి రాధా అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డ్ టీడీపీ అధ్యక్షుడు నమ్మి శ్రీను, విమాన నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహనరావు మరియు స్థానికులు బీమా మిత్ర సిబ్బంది పాల్గొన్నారు.



బీమా అందజేస్తున్న దృశ్యం

రక్తదానం మరొకరికి ప్రాణదానం

-కెన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సంతోష్



రక్తదాన కార్యక్రమంలో కెన్ ప్రతినిధులు

దాబాగార్డెన్స్,న్యూస్‌లీడర్: అవసరమైనవారికి రక్తదానం చేయడం ద్వారా మరొకరికి ప్రాణదానం చేయవచ్చని కెన్ ఫౌండేషన్ సొసైటీ వ్యవస్థాపకుడు పి. సంతోష్ కుమార్ అన్నారు. ద్వారకానగర్ జికె టవర్స్ ఎనలాగ్ ఐఏఎస్ ఇన్‌స్టిట్యూట్‌లో ఆదివారం కెజిహెచ్ బ్లడ్ బ్యాంకు నిర్వహణలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎండ కాలంలో బ్లడ్ కొరత ఎక్కువగా వుంటున్న తరుణంలో ఉత్తరాంధ్ర జిల్లాల ఆరోగ్య ప్రధాత కింగ్ జార్జ్ ఆసుపత్రి పేదరోగులకు అందుబాటులో వుండాలన్నా ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. 60 యూనిట్ల్ వరకు సేకరణ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌కమ్‌టాక్స్ అడిషనల్ కమిషనర్ ఎస్. రవిశంకర్, ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు ఎస్. గీతానారయణ్, కెజిహెచ్ బ్లడ్ బ్యాంకు మెడికల్ ఆఫీసర్ రాజే గుర్చక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

టెక్నాలజీతో నేరనియంత్రణకు శ్రీకారం



దాబాగార్డెన్స్,న్యూస్‌లీడర్: నేరాలు, ట్రాఫిక్ ఉల్లంఘన చేసే వారిని గుర్తించడమే కాకుండా క్లియర్ వాయిస్‌ను అందజేసే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సీసీ కెమెరాలను నగరంలో అన్ని పోలీస్‌స్టేషన్ పరిధిలోకి తీసురానున్నామని డీసీపీ ఫకీరప్ప తెలిపారు. ఆదివారం మహారాణిపేట పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన 9 సీసీ కెమేరాలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజల శాంతిభద్రతలే ధ్యేయంగా నూతన టెక్నాలజీలను ఉపయోగించి నగరపరిధిని పోలీసుల కనుసన్నల్లో మెరిగే విధంగా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. సిగ్నల్ క్రాసింగ్, హెల్మెట్ పెట్టుకోకపోవడం, ట్రిబుల్ రైడింగ్ తదితర ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని వాహనదారులను హెచ్చరించారు. వాటితో పాటు దొంగతనాలు, నేరాలు, తదితర ఫుటేజ్‌లు వాయిస్‌తో పాటు అందించే సీసీ కెమేరాలను మహారాణిపేటలో ఉన్న ముఖ్యమా దరిలో ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ అర్జున నరసింహ మూర్తి, రెండవ, మూడవ పట్టణ పోలిసు స్టేషన్‌ల లా అండ్ అండ్ ఆర్డర్, ట్రాఫిక్ సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

న్యాయ వ్యవస్థను నిర్వీర్యం చేయొద్దు

జిల్లా దళిత ఐక్యవేదిక కన్వీనర్ వెంకట్రావు



నినాదాలు చేస్తున్న దళిత నాయకులు

విశాఖపట్నం, న్యూస్‌లీడర్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో నిందుతుడైన వ్యక్తిని కాపాడే విధంగా సుప్రీంకోర్టు దర్మాసనం వ్యవహరించడం న్యాయవ్యవస్థను నిర్వీర్యం చేయడమేనని విశాఖజిల్లా దళిత ఐక్యవేదిక కన్వీనర్ బి.వెంకట్రావు ఆవేదన వ్యక్తం చేశారు. సుభాష్ కాశీనాథ్ మహాజన్ అను వ్యక్తిని ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులో నిందుతుడైనందుకు అరెస్టు చేయాలంటూ మహారాష్ట్ర హైకోర్టు స్థానిక పోలీసులకు ఆదేశాలు జారీచేసింది. అయితే సదరు వ్యక్తిని అరెస్టు చేయొద్దంటూ ఇటీవల సుప్రీంకోర్టు ఆదేశించింది. సుప్రీం కోర్టు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆదివారం దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో దాబాగార్డెన్స్ అంబేద్కర్ విగ్రహానికి నినాదాలర్పించి నిరసన కార్యక్రమం చేపట్టారు. కేసులో పటిష్టత లేకపోతే కేసు కొట్టివేయొచ్చునని, అంతేగాని ఇలా అరెస్టు ఆపమనడం సరికాదనే అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. ఈకేసును కేవలం ఇద్దరు న్యాయమూర్తులు కాకుండా ఫుల్ బెంచ్ పునర్విచారణ చేపట్టాలన్నారు. ఈకార్యక్రమంలో మూలనివాసి నేత రవి సిద్దార్థ, కొత్తపల్లి.వెంకటరమణ, మాటూరి.శ్రీనివాసరావు, చిన్నారావు, కెబీఆర్ అంబేద్కర్, రెయ్య వెంకటరమణ, బోరుగడ్డ.మోహన్, జి.రాంబాబు, బూసి.పరమేశ్వరి, మందే.సత్యన్నారాయణ అధిక సంఖ్యలో దళితులు పాల్గొన్నారు.

గాయపడిన భవన నిర్మాణ కార్మికులను ఆదుకోండి

టీఎన్‌టీయూసీ డిమాండ్



బాధిత కార్మికులకు పరామర్శిస్తున్న టీఎన్‌టీయూసీ నేతలు

గాజువాక : న్యూస్‌లీడర్ ఈ నెల 23వ తేదీన గాజువాక ప్రాంతం చైతన్యనగర్ ఏరియాలో నిర్మాణంలో ఉన్న భవనం స్లాబ్ కూలిన ఘటనలో 7గురు గాయాలు పాలైన సంఘటన పాఠకులకు తెలిసిందే. జరిగిన ప్రమాధంలో ఒకరికి కాళ్ళు విరిగిపోగా మరో కొంత మందికి శరీరంలో పలు భాగాల్లో గాయాలు కాబడ్డాయి. వీరిని వైద్యం నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించిన భవన నిర్మాణ యాజమాన్యం చికిత్స అందిస్తుంది. ఆదివారం టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి బొడ్డు పైడిరాజు చికిత్స పొందుతున్న కార్మికులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణాలు జరిగేటప్పుడు యాజమాన్యంతో పాటుగా కాంట్రాక్టర్ కార్మికుల భద్రతలను దృష్టిలో పెట్టుకుని ఉండాలని తెలిపారు. అనుకొన్న సమయానికి భవనం పూర్తికావాలనే ఆలోచనలతో కార్మికుల భద్రతలను గాలికి వదిలే పరిస్థి తులు ఉంటున్నాయని తెలిపారు. ప్రమాధంలో గాయాలు పాలైన వారికి అన్ని విధాలా సహాకారాలు అందించి ఆదుకోవాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేసారు. వారి కుటుంబం రోడ్డున పడకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో టీఎన్‌టీయూసీ నేతలు మొల్లి భరత్ యాదవ్, కన్నారావు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

ఎన్ఏడి, న్యూస్‌లీడర్: స్థానిక జీవీఎంసీ 48వార్డు కంచరపాలెం పరిధి ఏపీ బీసీఎల్ కార్యాలయ రహదారిలో జీవీఎంసీ నిధులు రూ 12.50లక్షలతో కాలువ నిర్మాణం, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి జోన్ -4 ఇంజినీరింగ్ విభాగం ఈఈ చిరంజీవి హాజరై శంకుస్థాపనను ప్రారంభించారు. ఈ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయుటకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ కొండలరావు, ఏఈ సతీ కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ గురునాథ్, సంతోష్, వార్డు టీడీపీ అధ్యక్షుడు శరగడం రాజశేఖర్, రంజిత్, జన్మభూమి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



రోడ్డు పనులకు శ్రీకారం చుడుతున్న దృశ్యం

సంచలన వార్తాపత్రిక
లీడర్

ఎడిటోరియల్

పంచాంగం
శ్రీ విళంబి నామ సంవత్సరం, ఉత్తరాయనం, వసంతరుతువు చైత్ర మాసం -శుక్లపక్షం

శు.దశమి రా. 3:42 వరకు
పునర్వసు మ. 12:44 వరకు
వర్జ్యం రా. 8:17 నుండి 9:47 వరకు
పు.దు.ము. మ 2-50 నుండి 3-42 వరకు
రా.కా. ఉ. 7-28 నుండి 9-14 వరకు

విశాఖపట్నం

సోమవారం 26-3-2018

హరియాణా ప్రభుత్వ ప్రాధాన్యతలు

స్కూలులో ప్రిన్సిపాల్ పన్నెండో తరగతి కుర్రవాణ్ని ఆలస్యంగా వస్తున్నావేం? హోంవర్కు చేయటం లేదేం? అని మందలించింది. అంతే వాడు యింటికి వెళ్లి ఫైనాన్షియర్ అయిన తండ్రి తుపాకీ తెచ్చుకుని వచ్చి స్కూలులో ఆవిణ్ని కాల్చి చంపేశాడు. జనవరి 20 నాటి యీ సంఘటన అమెరికాలో జరగలేదు. హరియాణాలో యమునానగర్‌లో జరిగింది. హరియాణాలో క్రైమ్ రేటు ఎప్పుడూ ఎక్కువే. సామూహిక బలాత్కారాల్లో 2014లో, 2015లో హరియాణాది ప్రథమస్థానం.లక్ష మంది మహిళలకు 1.9, 1.6 మంది రేప్‌కు గురయ్యారు. 2015లో వరకట్న చావుల్లో రెండో స్థానం. లక్ష జనాభాకు 1.9 మంది. స్త్రీలను వేధించడంలో మూడో స్థానం. 2016 వచ్చేసరికి అన్ని రకాల నేరాల సంఖ్య కలిపి క్రైమ్ రేట్ యింకా పెరిగింది. 2014లో 79,947 కేసులు నమోదైతే, 2015లో 84,466 అయితే 2016కి వచ్చేసరికి 88,527 అయింది. జనాభా నిష్పత్తి ప్రకారం చూస్తే లక్ష జనాభాకు 2015లో 310.4 ఉంటే 2016 నాటికి 320.6 అయింది. కులసంఘర్షణల్లో హరియాణాది దేశంలోనే ప్రథమస్థానం. 2016లో 250 కేసులు నమోదయ్యాయి. పొరుగున ఉన్న పంజాబ్‌లో ఒక్కటి కూడా లేదు. 2016లో 1057 హత్య కేసులు, 260 వరకట్న చావు కేసులు, 996 బలాత్కార కేసులు (వీటిలో 518 మైనర్లపై జరిగినవి), 191 గ్యాంగ్ రేప్ కేసులు, 17 యాసిడ్ ఎటాక్ కేసులు, 3932 కిడ్నాప్ కేసులు నమోదయ్యాయి. ప్రస్తుత బిజెపి ముఖ్యమంత్రి ఖట్టార్ 2014 అక్టోబరులో పదవి చేపట్టారు. మరుసటి నెలలోనే బాబా రాంపాల్ అనే దొంగబాబాను అరెస్టు చేయమని సుప్రీం కోర్టు ఆదేశాలిచ్చింది. అయితే అతన్ని అరెస్టు చేయబోవనివ్వమని అతని అనుచరులు అడ్డు తగిలారు. రెండు వారాల పాటు ఘర్షణ జరిగి, అటుయిటూ 200 మంది గాయపడ్డాక చివరకి సైన్యాన్ని పిలిపించి, అరెస్టు చేయగలిగారు. 2017 ఆగస్టులో బాబా రామ్ రహీమ్‌ను అరెస్టు చేసినపుడు అతని అనుచరులు యుద్ధవాతావరణాన్ని సృష్టించి, 36 మందిని పొట్టన పెట్టుకుంటే హరియాణా ప్రభుత్వం చేష్టలు డిగి చూస్తూ కూర్చుందని అందరూ గమనించారు. బాబా బిజెపికి మద్దతుదారు కాబట్టే యిలా జరిగిందనే విమర్శలు వచ్చాయి. ఇక 2016 ఫిబ్రవరిలో జాట్ల ఆందోళన సందర్భంగా రూ.34,000 కోట్ల ఆస్తి ధ్వంసమైంది. 30 మంది ప్రాణాలు కోల్పోయారు. 9 మంది సామూహిక అత్యాచారానికి గురయ్యారు. ఆ అల్లర్లపై విచారణ జరిపిన రిటైర్డ్ ఐపిఎస్ అధికారి ప్రకాశ్ సింగ్ నివేదిక ఐఏఎస్, ఐపిఎస్‌లతో సహా 90 మంది సివిల్, పోలీసు అధికారులను దోషులుగా పేర్కొంది. అయినా వారిపై చర్యలు లేవు.తాజాగా 2018 జనవరిలో రాష్ట్రవ్యాప్తంగా దళిత మైనర్ బాలికలపై జరిగిన 10 అత్యాచార కేసులు నమోదయ్యాయి. వెళుతున్న కారులోంచి ఒక మహిళను బయటకు గుంజి సామూహిక అత్యాచారం చేశారు. మరో కేసులో కూడా కారులోంచి బయటకు లాగి భర్త, మరిది ఎదుట రేప్ చేశారు. "పద్మావత్" సినిమా విడుదల సందర్భంగా కర్ణిసేన వారు స్కూలు పిల్లలున్న స్కూలు బస్సుపై రాళ్ల వర్షం కురిపించారు. అయితా రాబోయే రాజస్థాన్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని వారిపై చర్య తీసుకోలేదు. రాష్ట్రంలో హింసాకాండ యీ స్థాయిలో ఉంటే ఖట్టార్ సర్కార్ ఏం చేస్తోం దన్న అనుమానం రావచ్చు. 2017 నవంబరు-డిసెంబరులో కురుక్షేత్రలో అంతర్జాతీయ గీతా మహోత్సవం జరిపించింది. స్కూళ్లలో గీతాబోధన క్లాసులు మొదలుపెట్టారు. 4 వేల సంవత్సరాల క్రితం అదృశ్యమైన సరస్వతీ నదిని కనిపెట్టి పూజించడానికై సరస్వతీ హెరిటేజ్ ప్రాజెక్టు పనుల్లో నిమగ్నమైంది. ఇంటర్నేషనల్ సరస్వతీ మహోత్సవ్ అని 2018 జనవరి 18 నుంచి ఐదురోజుల పాటు యజ్ఞం నిర్వహించింది. అనేకమంది సాధువులు హాజరైన యీ కార్యక్రమంలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ పాలుపంచుకున్నారు. ఈ కార్యక్రమాలకై కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. హరియాణాలో యిప్పటికీ ఆడపిల్ల పుట్టగానే చంపివేస్తున్నారు. 1000 మంది మగవారికి 914 మంది ఆడవారు మాత్రమే ఉన్నారు. (జాతీయ సగటు 945) స్త్రీలపై అత్యాచారాలు అత్యంత సహజమైన విషయంగా ఉంది. బాబాలుగా అవతారమెత్తిన వారు భక్తురాళ్లను అన్ని రకాలుగా దోచుకుంటున్నారు. సరస్వతీ నది ఒక మహిళగా అవతారం ధరించి వస్తే హరియాణా ప్రభుత్వం ఆమెకు రక్షణ కల్పించే స్థితిలో లేదు. ఈ దుస్థితిని చక్కదిద్దకుండా హరియాణా ప్రభుత్వం సరస్వతీ నది అన్వేషణ, గీతా ఉత్సవం అంటూ కోట్లాది రూ.ల ప్రజాధనాన్ని వ్యయం చేయడం ఏ విధంగా సమంజసం?

నిధుల వినియోగమే రచ్చకు కారణమా?

బిజెపి ఆధ్వర్యంలో ఉన్న కేంద్రం, టిడిపి ఆధ్వర్యంలో ఉన్న రాష్ట్రం కలహించుకుని ఎవరి అంకెలు వాళ్లు చెపుతున్నారు. ఇద్దరిలో ఎవరు నిజం చెపుతున్నారో, ఎవరు దాస్తున్నారో కనిపెడతామంటూ బయలుదేరిన నిజనిర్ధారణ కమిటీ ఏం తేల్చిందో నాకు అర్థం కాలేదు. హోదాతో సమానమైన ప్యాకేజీ అంటారు, జేట్లే ఇఎపి(విదేశీ సంస్థల ఋణసహాయం) యిస్తామంటే బాబు నాబార్డ్ అంటారు, అబ్బే అదికాదు, ఎస్‌పివి (స్పెషల్ పర్పస్ వెహికల్) అని జేట్లే అంటారు.

2016 సెప్టెంబరు నుంచి యీ ఫిబ్రవరి దాకా చర్చలే నడుస్తున్నాయి. దానికీ, దీనికీ తేడా ఏమిటో, యీయన యిలా ఎందుకంటున్నాడో, ఆయన అలా ఎందుకంటున్నాడో నాకు బోధపడటం లేదు. కాస్త సమాచారాన్ని పోగేశాను కానీ అది కూడా నాకు తృప్తి నివ్వలేదు. అందువలన సంశయాలు, సందేహాలతోనే దీన్ని రాస్తున్నాను. దీనిలో సమాచారలోపం కానీ, నా అవగాహనాలోపం కానీ ఉంటే ఎత్తి చూప ప్రార్థన. అందరం కలిసి సత్యాన్ని అన్వేషిద్దాం.

మొత్తమంతా చదివే ఓపిక లేనివారి కోసం నా అనుమానాన్ని క్లుప్తంగా యిప్పుడే చెప్పేస్తాను. టిడిపితో సున్నం పెట్టుకున్నపుడు ఏం చూసుకుని బిజెపికి యీ ధైర్యం? అని ఆశ్చర్యపడ్డాను. ఇవాళ రైల్వే మంత్రి వైజాగ్ రైల్వే జోన్ కూడా లేదని కుండ బద్దలు కొట్టేశారు. టిడిపి ఎంపీలకు ఎపాయింట్‌మెంటు యివ్వకపోగా వైసిపికి యిచ్చారు. 'మొగుడు కొట్టినందుకు కాదు కానీ, తోటి కోడలు నవ్వినందుకు..' అన్నట్లయింది టిడిపికి. బిజెపి యింత పెంకెగా ఎందుకు వ్యవహరిస్తోంది? ఆంధ్రలో వాళ్లకు ఎటూ సీట్లు రావు కాబట్టి, వదిలేసుకుంది' అనే సమాధానం తృప్తి నివ్వదు.

ఈశాన్యభారతం మొత్తమంతా కలిపి 25 ఎంపీ సీట్లు. ఒక్క ఆంధ్రలోనే అన్ని సీట్లున్నాయి. ఈశాన్యంలో పాగా వేయడానికి మోదీ, అమిత్ నాలుగేళ్లగా శ్రమించి సాధించారు. అలాటిది ఆంధ్రను ఉత్తినే వదిలేసుకుంటారా? వైసిపి మద్దతు యిస్తుందని వారి ధీమా అనడం నవ్వు తెప్పిస్తోంది. ఉపయెన్నికలో వైసిపి తన బలాన్ని నిరూపించుకోలేక పోయింది. దాని నాయకులు టిడిపిలోకి చేరుతూనే ఉన్నారు. వైసిపి వద్ద ఏముందని చేతులు కలపాలి? బిజెపి ఎన్నికలలో విడిగా పోటీ చేయవచ్చునుకోవడానికి ఆస్కారం ఉంది.

ఆంధ్రులను యింత ఆరళ్లు పెట్టి వాళ్లను ఫేస్ చేయగలరా? చేయలేరా? సపోజింగ్, నియోజకవర్గాల్లో పలుకుబడి ఉండి ఆర్థిక సత్తా ఉన్న టిడిపి నాయకులను తమ పార్టీలోకి గుంజుకుని ముందుకు వెళితే !? గమనించారో లేదో అనేక రాష్ట్రాలలో బిజెపి ఫిరాయింపుదారులతోనే నెగ్గుతోంది. నిన్ననే ఎస్పీ నుంచి నరేశ్ అగర్వాల్‌ను లాక్కుంది. యుపిలో అందరు ఎంపీలు, ఎమ్మెల్యేలు ఉండగా యీయనొకడు అవసరమా అని మనం అనుకోవచ్చు. అవసరమే, అవతలిపార్టీని నిర్వీర్యం చేయడానికి.. అని బిజెపి హైకమాండ్ అనుకోవచ్చు. కాంగ్రెసు నుంచి వైసిపికి, వైసిపికి టిడిపికి, కాంగ్రెసు నుంచి బిజెపికి, యిలా పలువురు ఆంధ్ర నాయకులు చిత్తం వచ్చినట్లు గోడ దూకేస్తూ వచ్చారు. గతంలో బాబు తన మనుష్యులనే బిజెపి ద్వారా నిల బెట్టారన్న వదంతీ ఉంది. ఇప్పుడు అమిత్ రివర్స్‌లో గేమ్ ఆడవచ్చు.

బిజెపి వాళ్లు ఎన్నికలకు ముందు టిడిపి మీద రాళ్లేయడం ఖాయమనిపిస్తోంది. ఏ విధంగా వేస్తారు? 'మేం నిధులు యివ్వడానికి సిద్ధపడ్డాం. కానీ బాబు వాటిని పక్కదారులు పట్టిద్దామని ప్రయత్నించారు, పనులేవీ పూర్తి చేయకుండా మీ నెత్తి మీద ఋణభారం పెడదామని చూశారు, అందుకే ఆపి పెట్టాం. మేం రాష్ట్రంలో కూడా గెలిస్తే అవన్నీ మేమే స్వహస్తాలతో సవ్యంగా ఖర్చు పెడతాం.' అనే నినాదంతో ముందుకు వెళతారని నా అంచనా. వాళ్లు తమ వాదనను ఎలా సమర్థించుకుంటారో చూద్దామని నా కుతూహలం. అదే యీ వ్యాసం రాయడానికి పురికొల్పింది.

రాష్ట్రం యివ్వకపోవడం వలననే నిధుల విడుదల ఆగిపోయిందని కేంద్రం అంటోంది. ఆ మాట నిజమో



కాదో చెప్పాలి కదా! డబ్బు ఖర్చు పెట్టాక పద్దు చెప్పక పోతే ఎలా? నిధులు లేక అల్లాడుతున్నాం అంటున్న రాష్ట్రం తమ మీద ఆ నింద లేకుండా చూసుకోవాలి కదా. ఇచ్చిందనో, యివ్వలేదనో, సగమే యిచ్చిందనో చెప్పకుండా ఈ కమిటీ 'ఇవ్వాలి' అని జనరల్ స్టేటుమెంటు యిస్తే ఎలా? నిజనిర్ధారణ కమిటీ ప్రకారం మొదటి ఏడాది లోటు 16వేల కోట్లూ కేంద్రమే భరించాలి.


అంతే కాదు, ఐదేళ్ల పాటు వచ్చే రెవెన్యూ లోటు కూడా భరించాలి. 9 సంస్థలకు గాను 11700 కోట్లు, విభజన తర్వాత కూడా కంపెనీ ప్రధాన కార్యాలయాలు తెలంగాణలో ఉండిపోవటం వలన టాక్స్ రెవెన్యూలో ఆంధ్ర నష్టపోయిన మొత్తం 3800 కోట్లు, కాకినాడ పెట్రో కెమికల్ కాంప్లెక్స్‌కై 5 వేల కోట్లు గ్యాప్‌గా ఇవ్వాలి అంటూ ఏవో చేర్చి ఆ మొత్తం తేల్చారు. తమ ప్రకటనలలో కేంద్రానిదీ, రాష్ట్రానిదీ యిద్దరిదీ తప్పుంది అంటూనే కేంద్రాన్నే ఎక్కువ తిట్టారు. కమిటీని ఎవరూ సీరియస్‌గా తీసుకున్నట్లు లేదు.

'పోలవరానికి యిచ్చిన డబ్బు ఏ మూలకు సరిపోతుంది, కేంద్రం చేసిన కొత్త భూసేకరణ చట్టంతో పునరావాస వ్యయం 33 వేల కోట్లకు చేరింది. అది కేంద్రం భరించాలి. దానిపై అది మౌనంగా ఉంది' అంటుంది రాష్ట్రం. అది కేంద్రం చేపట్టవలసిన ప్రాజెక్టు. కాంట్రాక్టులపై ఆసక్తితో కాబోలు చంద్రబాబు మేమే చేపడతాం అని తీసుకున్నారు. ఇలాటి అదనపు వ్యయాలన్నీ నెత్తిన పడుతున్నాయి. 'కాంట్రాక్టుల గురించి కాదు, కేంద్ర ప్రాజెక్టులంటే కనీసం పదేళ్లు పడతాయి, రాష్ట్ర ప్రయోజనాల పట్ల శ్రద్ధతో త్వరగా పూర్తి చేయాలని తీసుకున్నారు' అని కొందరు వాదించవచ్చు. తక్కిన ప్రాజెక్టుల విషయంలో ఇఎపి ద్వారా నిధులిస్తామంటే, అవి నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాల్సి వస్తుంది అంటూ బాబు వెనకడుగు వేస్తున్నారెందుకు అనే ప్రశ్నకు వాళ్లు సమాధానం చెప్పాల్సి వుంటుంది.

ఇక అత్యంత వివాదాస్పదంగా మారిన 2014-15 తాలూకు రెవెన్యూ లోటు గురించి. దీనిని కాగ్ కూడా నిర్ధారించింది అని రాష్ట్రమూ, నిజనిర్ధారణ కమిటీ కూడా చెపుతున్నాయి. కాగ్ 2014-15 నివేదిక చూశాను. అలా ఏమీ కనబడలేదు. కేంద్రం నుంచి వీళ్లకు పరిహారంగా యింత రావాలి అనేది వాళ్ల పరిధిలోకి రాదనుకుంటాను.

హోదా యివ్వకుండా బిజెపి ఆంధ్రకు అన్యాయం చేసిందన్నదాంట్లో సందేహం లేదు. అనేక విధాలుగా నాన్-కోఆపరేషన్ చేస్తోందన్నదాంట్లో సంశయం లేదు. కానీ నిధుల విడుదల విషయంలో మాత్రం బాబుకు కళ్లెం వేయడంలో రాష్ట్రానికి ఒక విధంగా మేలు చేస్తోందనే చెప్పాలి. లేకపోతే బాహర్ షేర్వాణీ, ఘర్‌మే పరేశానీ అన్నట్లున్న బాబు బడాయిలకు అంతూపొంతూ లేకుండా ఉంది. పాత అప్పులకు వడ్డీ కట్టే ఠికానా లేదు కానీ, సింగపూరులా చేస్తాం, జపాన్‌లా చేస్తాం అంటూ బ్రోషర్లు, పబ్లిసిటీపై కోట్లకు కోట్లు ఖర్చు. ప్రతీదీ ఆడంబరమే. ఈయన తానాకు కేంద్రం తందానా అని ఉంటే రాష్ట్రం యీ పాటికే అప్పుల ఊబిలో మునిగిపోయేది.

బుద్ధుడు సందేశాలు



కోరిక లేకపోవడమే పుణ్యానికి మూలం

కామానికి దాసుడు కాకపోవడం, నిందలు వేయక పోవడం, క్రూరత్వం లేకపోవడం, ఇత రులను గురించి ఊసులాడక పోవడం, ఈర్ష్యా ద్వేషాలు, అబద్ధాలు వదిలి వేయడం పుణ్య కార్యాలే. సత్యానికి విధేయత్వం పుణ్యం. ఇవన్నీ మంచివే. "మిత్రులారా! పుణ్యానికి మూలం ఏమిటి? కోరిక లేకపోవడం పుణ్యా నికి మూలం. ద్వేషం లేకపోవడం పుణ్యానికి ఆధారం. భ్రమలేక పోవడం పుణ్యానికి హేతువు. ఇవీ పుణ్యానికి మూలమైనవి. "దుఃఖమంటే ఏమిటి? దుఃఖం ఎలా వస్తుంది? దుఃఖం ఎలా నశిస్తుంది? పుట్టుక దుఃఖం. వృద్ధాప్యం దుఃఖం. వ్యాధి దుఃఖం. మరణం దుఃఖం. దరిద్రం దుఃఖం. నిరాశా నిస్పృహలు వేదన కలిగిస్తాయి. అయిష్టమైన వాటితో కలయిక బాధ కలిగిస్తుంది. కోరింది లభించక పోవడం, ప్రేమించినదాన్ని కోల్పోవడం విచార కారణాలు. ఇవన్నీ దుఃఖానికి హేతువులు.

"దుఃఖానికి మూలం ఏమిటి? కామం, మోహం, సుఖాల కోసం వెంపర్లాట, ఇవి పునర్జన్మలకు దారితీస్తాయి. కామం, కోరికలు, స్వార్థం ఇవన్నీ దుఃఖానికి మూలం.

"దుఃఖం సమసిపోవడమంటే ఏమిటి? తృష్ణ సమూలంగా నిర్మూలం కావడం, కామాన్ని విసర్జించి, దాని నుంచి విముక్తి పొందడం, అదే దుఃఖ నివారణ. "దుఃఖ నివారణకు మా ర్గం ఏమిటి? పవిత్రమైన ఆర్య అష్టాంగ మార్గమే దుఃఖ నిర్మూలనకు త్రోవ చూపు తుంది. సమ్యక్ దృష్టి సమ్యక్ సంకల్పం, సమ్యక్ వాక్కు సమ్యక్ కార్యాచరణ, సమ్యక్ జీవనం, సమ్యక్ యత్నం, సమ్యక్ స్మృతి, సమ్యక్ సమాధి ఈ మార్గంలోని ఎనిమిది అంగాలు. 'ఏ ఉత్తమ యువకుడైనా దుఃఖం ఉన్నది, దానికి కారణం ఉన్నది, దుఃఖాన్ని నివారించవచ్చు, అందుకు మార్గమున్నది, అని గుర్తించి దుఃఖ నివారణ మార్గాన్ని ఎంచుకొని, కామక్రోధాదులను, నేను అనే అహంకారాన్ని వర్జించి, అజ్ఞానం నుంచి బయట పడి, జ్ఞానోదయాన్ని సాధిస్తే అతడు ఈ జన్మలోనే దుఃఖాన్ని సమూలంగా అంతం చేయవచ్చు." పది పాపాల నుంచి ఎలా తప్పించుకోవాలో చెబుతూ బుద్ధుడు ఒకసారి ఇలా ప్రసంగించాడు. "ప్రాణులు చేసే కర్మలు పది విషయాల వలన దుష్టమైపోతాయి. ఆ పది విషయాలను దరికి చేరనివ్వకపోతే ఆ కర్మలు మంచివి అవుతాయి. ఈ పది దుష్కర్మలలో శరీరం ద్వారా మూడు, నాలుక ద్వారా నాలుగు, మనస్సు ద్వారా మూడు జరుగుతుంటాయి. శరీరం చేసే చెడ్డపనులు- హత్య, దొంగతనం, వ్యభిచారం. నాలుక చేసేవి - అబద్ధాలు, నిందలు, దూషణ, ఉబుసుపోక ముచ్చట్లు. మనస్సు చేసే దోషాలు - దురాశ, ద్వేష భావం, దుష్టమైన ఆలోచనలు.

దిన ఫలాలు

సోమవారం -26-3-2018

మేషం: బంధుమిత్రులతో కలసి విందు, వినోదాలలో పాల్గొంటారు. ఉద్యగస్తులు విశ్రాంతికై చేయు ప్రయత్నాలు ఫలిస్తాయి. కుటుంబీకులతో ఏకీభవించలేకపోతారు.

వృషభం: ద్విచక్ర వాహనంపై దూరప్రయాణాలు మంచిది కాదు. స్త్రీలకు పనివారలతో చికాకులు తప్పవు. ధన సహాయం, హామీలకు దూరంగా వుండటం మంచిది.

మిథునం: వ్యవసాయ, తోటల రంగాల్లో వారికి సంతృప్తి, పురోభివృద్ధి కానవస్తుంది. స్త్రీలకు వ్యాపకాలు, పరిచయాలు విస్తరిస్తాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు.

కర్కాటకం: కొబ్బరి, పండ్ల, పూల, కూరగాయల వ్యాపారులకు లాభదాయకంగా వుంటుంది. ఉత్తర ప్రత్యుత్తరాలు సంతృప్తినిస్తాయి. పాత మిత్రుల కలయికతో సంతోషం.

సింహం: ఆర్థిక విషయాల్లో సంతృప్తి కానరాదు. స్థిరాస్తి కొనుగోలు చేయాలనే మీ ఆలోచన కార్యరూపం దాల్చుతుంది. భాగస్వామికులతో కొత్త విషయాలు చర్చకు వస్తాయి.

కన్య: వాతావరణంలో మార్పు పనులకు ఆటంకమవుతుంది. పత్రికా సంస్థల్లోని వారికి చిన్న చిన్న పొరపాట్లు దొర్లే ఆస్కారం వుంది. స్త్రీలకు విదేశీ వస్తువులపై ఆకర్షితులవుతారు.

తుల: మీ ఇష్టాయిష్టాలను సున్నితంగా వ్యక్తం చేయండి. ఉద్యోగస్తులు విశ్రాంతికై చేయు ప్రయత్నాలు ఫలిస్తాయి. మత్స్య కోళ్ళ వ్యాపారస్తులకు లాభదాయకం.

వృశ్చికం: ఆత్మీయులు, చిన్నారులకు విలువైన కానుకలు చదివించుకుంటారు. ఎవరికైనా ధన సహాయం చేసినా తిరిగి రాజాలదు. రాజకీయాల వారికి పార్టీ పరంగా గుర్తింపు.

ధనస్సు: శారీరక శ్రమ వల్ల ఆరోగ్యంలో సంతృప్తి కానరాదు. విజ్ఞతాయుతంగా వ్యవహరించి మీ గౌరవాన్ని కాపాడు కోండి. అనుక్షణం మీ సంతానం విద్యా, ఉద్యోగ విషయాలపై దృష్టి.

మకరం: ఆర్థిక లావాదేవీలు, కుటుంబ వ్యవహారాలు సమర్థవంతంగా నిర్వహిస్తారు. మీ శ్రీమతి ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదు. దైవ, పుణ్య, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటారు.

కుంభం: బంధువుల రాకతో గృహంలో సందడి కాన వస్తుంది. మీ బలహీనతలు, అలవాట్లు అదుపులో ఉంచు కోవడం శ్రేయస్కరం. ఒక కార్యం నిమిత్తం ఆకస్మికంగా ప్రయాణం చేయాల్సివస్తుంది.

మీనం: మార్కెట్ రంగాల వారికి ఒత్తిడి, శ్రమాధిక్యత తప్పదు. ప్రియమైన వ్యక్తుల కలయికతో మానసికంగా కుదుటపడతారు. ధనం ఏమాత్రం నిల్వ చేయకపోవడం వల్ల ఆందోళన.

కరక్కాయతో అనారోగ్యాలకు చెక్



కరక్కాయను సంస్కృతంలో హరితకి అంటారు. దీని శాస్త్రీయ నామం. కరక్కాయ వాత తత్వంపై పనిచేస్తుంది. బుద్ధిని వికసింప జేస్తుంది. బలం కలిగిస్తుంది. ఆయుష్షను పెంచుతుంది. దీని వల్ల మలబద్ధకం, పైల్స్, వాంతులు, అసిడిటీ, గ్యాస్, నేత్ర సమస్యలు దూరమవుతాయి. దీన్ని ఉపయోగించి ఏయే అనారోగ్య సమస్యలను ఎలా నయం చేసుకోవచ్చో ఇప్పుడు తెలుసుకుందాం. కరక్కాయ పొడిని 3 గ్రాముల మోతాదులో తీసుకుని దానికి అంతే మోతాదులో తేనె కలపాలి. ఈ మిశ్రమాన్ని నిత్యం ఉదయం, సాయంత్రం రెండు పూటలా 10 రోజుల పాటు తీసుకుంటే పచ్చ కామెర్లు తగ్గుతాయి. కరక్కాయ పొడి ఒక భాగం, వేయించిన పిప్పళ్ల పొడి అరభాగం తీసుకుని రెండింటినీ కలపాలి. ఈ మిశ్రమాన్ని ఒక గ్రాము తీసుకుని దానికి తేనె కలిపి ప్రతి 4 గంటలకు ఒకసారి సేవించాలి. దీంతో కోరింత దగ్గు తగ్గుతుంది. భోజనానికి ఒక గంట ముందు కరక్కాయ పొడిని కొంచెం బెల్లంతో కలిపి తీసుకుంటే రక్త మొలలు తగ్గిపోతాయి. కరక్కాయ పొడిని తేనెలో కలిపి తీసుకుంటే విష జ్వరాలు తగ్గుతాయి. కరక్కాయ పొడిని ఆముదంలో కలిపి ప్రతి రోజూ తీసుకుంటే కీళ్ల నొప్పులు తగ్గుతాయి. కరక్కాయ, శొంఠి, తానికాయ, పిప్పళు వీటి చూర్ణాలను సమానంగా కలిపి నిల్వచేసుకొని పూటకు అర టీస్పూన్ చొప్పున మూడుపూటలా తేనెతో గాని లేదా నీళ్ళతో గాని కలిపి తీసుకుంటే దగ్గుతోపాటు ఆయాసం కూడా తగ్గుతుంది. ఎక్కిళ్లు ఇబ్బంది పెడుతున్నప్పుడు కరక్కాయల చూర్ణాన్ని అర టీస్పూన్ చొప్పున అరకప్పు వేడినీళ్లతో గాని లేదా తేనె, నెయ్యి మిశ్రమంతోగాని కలిపి తీసుకోవాలి. ఆయాసం, ఎక్కిళ్లుసతమతం చేస్తున్నప్పుడు బెల్లం పానకంలో కరక్కాయని లేక కరక్కాయ పొడిని వేసి ఉడికించి తీసుకోవాలి. ఎక్కిళ్లు, ఉబ్బసం, దగ్గు, గుండె జబ్బులు కలిసికట్టుగా హింసిస్తున్నప్పుడు వేడిచేసిన పాత నెయ్యిలో కరక్కాయల పెచ్చుల చూర్ణం, ఇంగువ పొడి, బిడాలవణం చేర్చి కలిపి మోతాదుకు అర టీస్పూన్ చొప్పున రెండు పూటలా తీసుకోవాలి. రక్తహీనతతో బాధపడేవారు కరక్కాయలను గోమూత్రం లో నానబెట్టి, తరువాత ఎండబెట్టి, పొడిచేసి, పూటకు అర టీస్పూన్ మోతాదులో రెండు పూటలా అర కప్పు నీళ్లతో కలిపి తీసుకోవాలి.

చరిత్రలో మార్చి 26



1875 : జర్మన్ భౌతిక శాస్త్రవేత్త మాక్స్ అబ్రహమ్ జననం.(మరణం. 1922)

1933 : ప్రముఖ రచయిత ఆచార్య కుబేర్ నాథ్ రాయ్ జననం.

1971 : పాకిస్థాన్ నుండి తూర్పు పాకిస్థాన్ స్వాతంత్ర్యం పొంది బంగ్లాదేశ్ గా అవతరించింది. (బంగ్లాదేశ్ స్వాతంత్ర్య దినోత్సవం)

2000: రష్యా అధ్యక్షుడిగా వ్లాదిమిర్ పుతిన్ ఎన్నికయ్యాడు.

2006 : ప్రముఖ రాజకీయవేత్త అనిల్ బిశ్వాస్ మరణం.(జననం.1944)

2006: తెలుగు సినీ నిర్మాత దుక్కిపాటి మధుసూదనరావుమరణం.

2008: భూటాన్ లో తొలిసారిగా జరిగిన ప్రజాస్వామ్య ఎన్నికలలో గెలిచి జిగ్మీ థిన్లే ప్రధానమంత్రి పదవిని చేపట్టాడు.

దుక్కిపాటి మధుసూదనరావు గారు సీతారామ స్వామి మరియు గంగాజలం దంపతులకు 17 జూలై, 1917 తేదీన కృష్ణా జిల్లా గుడివాడ తాలూకులోని పెయ్యేరు గ్రామంలో జనించారు. చిన్నతనంలో కన్నతల్లి కనుమూయడంతో సవతితల్లి పెంచి పెద్దచేశారు. ఆమె కన్నతల్లి ప్రేమ ఎరుగని దుక్కిపాటిని లాలించి, బుజ్జగించి, తీర్చి, ప్రయోజకుడిని చేశారు. అందుకే ఆయన ఆ తల్లిని మరచిపోలేకపోయాను. చదువుకోవలసిన వయసులో తండ్రి అనారోగ్యంతో మంచం పట్టడంతో చదువు మానక తప్పిందికాదు. చదవుమాని వ్యవసాయం పనులు చేశారు. అలా కొన్నాళ్లకి వ్యవ సాయం ఒకదారికి రాగానే దుక్కిపాటి మళ్లీ చదువుపై దృష్టి సారించారు. నోబుల్ కళాశాలలో చేరారు. అక్కడ ఆయన చక్కని కార్యకర్తగా ఎదగడానికి పరిస్థితులు ప్రేరేపించాయి. కళాశాలలో 'డ్రమెటిక్ అసోసియేషన్' ఎన్నికల్లో నిలిచి దానికి కార్యదర్శి అయ్యారు. ఆ కాలంలో ఆయన ఎన్నో నాటికలు విద్యార్థులచేత ప్రదర్శింపచేశారు. అలా ఆయన విద్యార్థి దశనుంచే అనుభవం గడించారు. చదువు పూర్తయ్యాక ఎక్సెల్సియల్ క్లబ్బు అనే నాటక సంస్థను ప్రారంభించారు.

దానికి కార్యదర్శి అయ్యారు. కోడూరి అచ్చయ్య, ఎం.ఆర్.అప్పారావు వంటి మిత్రులతో కలసి ఆ క్లబ్బు పక్షాన నాటకాలు విరివిగా ప్రదర్శించారు. మధుసూదనరావు తెచ్చిన సంస్కరణలే ఆయనకు పేరు తెచ్చాయి. ఎక్సెల్సియల్ క్లబ్లులో దుక్కిపాటితోపాటు పెండ్యాల, బుద్ధిరాజు శ్రీరామమూర్తి వంటివారూ ఉండేవారు. దుక్కిపాటి న్యుమోనియా వ్యాధితో బాధపడూతూ 90 యేళ్ళ వయసులో 26 మార్చి, 2006 ఆదివారం రోజున మరణించారు

శ్రీవేంకటేశ్వర వైభవము

సర్వతీర్థోత్కృష్టత్వకాంక్ష ఆమెను వదలకపోవుటయే భగవంతుని గూర్చి ఘోరముగా తపస్సుచేసెను. అంత భగవంతుడు ప్రత్యక్షముకాగా, ఆ సరస్వతి ఓ దేవాదిదేవా! నేను సర్వతీర్థోత్కృష్టకామనచే సరస్వతీ నదిగా ప్రవహించియు పులస్త్య బ్రహ్మశాపమువలన సర్వతీర్థ గౌరవమును పొందలేక పోతిని. నాకు సర్వతీర్థగౌరవముండునట్లు వరమివ్వమని ప్రార్థించెను.


అతివాత్సల్యములో భగవంతుడిట్లు పలికెను! ఓ సరస్వతీ! ఆ పుణ్యస్యబ్రహ్మశాపము గంగానదీ గౌరవమును తొలగించును కాని, పుస్కరిణీగౌరవమును తొలగించనేరదు. గాన నీవు పవిత్రాతిపవిత్రమగు వేంకటాద్రియొక్క శిఖరమునందు పుష్కరిణీ రూపముగా నివసించుము. నేను నీకు దక్షిణ భాగమున నివసించగలను.

భువనత్రయముందుగల మూడుకోట్ల యేబదిలక్షల గంగాది తీర్థములన్నియు, సంవత్సరకాలము పాపిసంసర్గముచే తమకు సంక్రమించిన పాపజాలమునంతయు నివృత్తి చేసుకొనుటకై నన్ను యాచింపగలవు. నేను సర్వతీర్థముల యొక్క పాపనివృత్తికై, ధనుర్మాసమున శుక్ల పక్షమునందు ద్వాదశీ దినమున అరుణోదయ సమయమునందు నీయందు సాన్నిధ్యము చేయవలెను. అప్పుడు మీ పాపజాలమంతయు నివృత్తి కాగలదు. అని సర్వతీర్థములకు చెప్పెదను. అందుచే తీర్థము లన్నియు తీర్థాధిరాజ్యమునందు నిన్ను అభిషేకము చేయగలవు అని వరమిచ్చెను.

అందువలన త్రైలోక్య విశ్రుతములగు తీర్థములన్నియు స్వామి పుష్కరిణీ తీర్థమును తీర్థాధిరాజ్యమునందభిషేకము చేసినవి. అందుచే తీర్థములన్నియు ఆ పర్వదినమునవచ్చి స్వామిపుష్కరిణీ సాన్నిధ్యమును పొంది తత్సమన్వయముచే పాపనివృత్తిని చేసుకొని వెళ్ళుచుండును.

అటుల తీర్థాధిరాజ్యస్థానమునలంకరించిన శ్రీ స్వామి పుష్కరిణీ యొక్క తీరమునందు దురత్యయ మాయావిమోచనకర్తయగు శ్రీనివాస ప్రభువు శ్రీ లక్ష్మీదేవితో సహా పరమానంద స్థానమగు శ్రీ వైకుంఠమును కూడా వదలి దాస్యభూషణాలంకృతులగు వారలకు తీర్థప్రసాదాది ప్రదానము చేయించి మాయావిమోచనమును చేయుటకై

బ్రహ్మపురాణం



వేంచేసియున్నాడు అందుచే నిది కలియుగ వైకుంఠమనియు ఈ స్వామిపుష్కరిణి శ్రీ భూదేవిలాలితమగు భగవత్క్రీడా వాపియనియు వ్యాసులవారభి ప్రాయపడుచున్నారు.

అమోఘశక్తులు కలిగి తీర్థజాలముచే తీర్థాధిరాజ్యమునందభిషేకము చేయబడి శ్రీ స్వామి సాన్నిధ్యమును సంపాదించుకొనిన సర్వ తీర్థస్వామినియగు శ్రీ స్వామి పుష్కరిణి యందు మహాశక్తిమంతములగు నవతీర్థములు కలవు. ఆ తీర్థములు: 1. పూర్వభాగమున ఆయు:ప్రదమగు మార్కండేయ తీర్థము, 2. ఆగ్నేయభాగమున పాపవిమోచకమగు ఆగ్నేయ తీర్థము, 3. దక్షిణభాగమున నరకోత్తారకమగు యామ్యతీర్థము, 4. నైర్ఋతి భాగమున ఋణవిమోచకమగు వశిష్టతీర్థము, 5.పశ్చిమ, వాయువ్య భాగములయందు కైవల్యదాయమకములగు వారుణవాయు తీర్థములు,7. ఉత్తరభాగమున ధన సంపత్ప్రదమగు ధనదతీర్థము 8. ఈశాన్యభాగమున భక్తిముక్తి ప్రదాయకమగు గాలవతీర్థము, 9. మధ్యభాగమున మహాపాతక నాశకమగు సరస్వతీతీర్థము. ఈ నవతీర్థములతో కూడిన శ్రీ స్వామి పుష్కరిణి యొక్క స్నానపానాది సేవనము మానవులకు సర్వపురుషార్థ సాథకము అని చెప్పుచున్నది. వరాహపురాణము.

పూర్వకాలమున సాంకాశ్య దేశమునందు చంద్రవంశీయుడగు శంఖణుడనురాజు పితృపితామహప్రాప్తమగు రాజ్యమును పరిపాలించుచుండ సామంతరాజాలు బలవంతులై అతని రాజ్యము నవహరించిరి, రాజ్యభ్రష్టుడైన శంఖణుడు ఆ అవమానమున సహింపలేక భార్యతోను మంత్రులతోను దక్షిణ దిక్కుకు ప్రయాణముచేసి తీర్థయాత్రలను చేయుచూ రామసేతువును దర్శించెను. అచ్చట సేతుస్నానముచేసి మరలివచ్చుచూ మార్గమధ్యమున సువర్ణముఖరీనదీ స్నానమును, పద్మ సరోవరస్నానమును విధి ప్రకారము నిత్యముచేయుచు అచ్చట నిలిచి యుండెను. ఒక్కనాడు శంఖణుడు తన రాజ్య భ్రంశమును స్మరించి ధు:ఖించి భగవంతుని ప్రార్థించుచూ నిదురించెను.

అప్పుడు అశరీరవాణి "ఓ రాజా! ధు:ఖింపకుము. ఇచ్చటికి క్రోశమాత్రములో, ఆపన్న కామధేనువగు వేంకటాద్రికలదు. అచ్చట నిర్హేతుక దయా పూర్ణుడగు కమలాపతికలదు. వారికి ప్రేమ పాత్రమగు తీర్థరాజము కలదు. నీవు అచ్చటికి వెళ్లి ఆ తీర్థరాజమగు పుష్కరిణి యందు స్నానము చేయుచు శ్రీస్వామిని దర్శించుచు ఆ తీరమును నివసించుము.

ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు

గోపాలపట్నం, న్యూస్‌లీడర్: గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లో ఉన్న శ్రీ సీతారామాలయాల్లో నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. కల్యాణ వేడుకలు రంగరంగవైభవంగా నిర్వహించారు. స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



కమనీయం సీతారాముల కళ్యాణం

అనకాపల్లి టౌన్, న్యూస్‌లీడర్: పట్టణంలోని గవరపాలెం పెదరామస్వామి దేవస్థానంలో ఆదివారం ఉదయం శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉదయం ఆరుగంటల నుంచి శ్రీసీతారాములవారికి పంచామృతాలతో అభిషేకాలు, అలంకరణ, అర్చన, 11.30నిముషాలకు కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ జగన్ ప్రభాకర్ దంపతులు, దైలీ కరస్పాండెంట్ డాక్టర్ రత్నాకర్ దంపతులతో పాటు మరో ఎనిమిది మంది దంపతులు ఈ కళ్యాణంలో పాల్గొన్నారు. ఆలయ ఛైర్మన్, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు నేతృత్వంలో కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు కొణతాల సత్యనారాయణ, మళ్ల రాజా, కొణతాల మురళీ కృష్ణ, కర్రి శివుడు, కొణతాల పూర్ణ చంద్రరావు, పొలమరశెట్టి రాజేశ్వరరావు పాల్గొన్నారు.

విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో... పట్టణంలోని గవరపాలెం విజ్ఞాన సమితి వద్ద ఆదివారం తెలుగుదేశంపార్టీ నాయకులు మళ్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు.

అంబేద్కర్ నగర్, చినబోయిగూడెం వీధుల్లో... సీతారాములవారి కళ్యాణం ఆదివారం ఘనంగా జరిగాయి. చినబోయిగూడెంవీధిలో యల్లపు వెంకట రమణ దంపతులు కల్యాణంలో పాల్గొన్నారు. అంబేద్కర్ నగర్‌లో బోది వెంకట అప్పారావు, తత్తర అప్పారావు ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణ వేడుకలు ఘనంగా జరిగాయి.

విజయరామరాజుపేటలో... పట్టణంలోని విజయరామరాజుపేట రామాలయంలో శ్రీరామనవమి వేడుకలలో భాగంగా ఆదివారం శ్రీసీతారాముల కళ్యాణం వైభవంగా నిర్వహించారు. వేకువజామున నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి కళ్యాణాన్ని కమనీయంగా జరిపించారు. మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ పలకా సత్యనారాయణ దంపతులు కళ్యాణంలో కూర్చొని శాస్త్రోక్తంగా వేదపండితుల నడుమ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను పురవీధులలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు, పలు సామాజిక వర్గాలవారు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో... శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం ఎలమంచిలి పట్టణంలో, మండలంలోని ప్రతీ గ్రామంలో సీతారాములవారి కళ్యాణ మహోత్సవం ప్రజలంతా కలిసి అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఎలమంచిలి పట్టణంలో ధర్మవరం కలిసి... తులసీనగర్ చినరామస్వామి కోవెల వద్ద మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, రామకృష్ణ దంపతులు కళ్యాణంలో కూర్చొని శాస్త్రోక్తంగా రాములవారి కల్యాణం నిర్వహించారు.



పెదరామస్వామి ఆలయంలో కల్యాణంలో పాల్గొన్న ప్రభాకర్, రత్నాకర్ దంపతులు



విజ్ఞాన సమితి వద్ద సీతారాముల కళ్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

అలాగే మున్సిపాలిటీ పరిధిలో కొత్తపేట రామాలయంలో న్యాయమూర్తులే ఆదివారి పెళ్లిపెద్దలుగా వచ్చి రామాలయంలో కళ్యాణాన్ని జరిపించారు. కొత్తపాలెంలో గ్రామ పెద్దలు ఆదారి వెంకట రెడ్డినాయుడు దంపతులు, దాడి కృష్ణనాయుడు దంపతులు జరుపులు పద్మ, వరుడు తరువున కళ్యాణాన్ని జరిపించారు. గ్రామస్తులంతా కళ్యాణంలో పాల్గొన్నారు. పేట అప్పలపరంలో గ్రామంలో గల ఏడు భజన సంఘాలాలు సీతమ్మవారికి పింది వంటలతో సారె ఊరేగింపుగా తీసుకొచ్చి రాములవారి కళ్యాణం జరిపించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మొల్లి సీతారామయ్య, మొల్లి గోవింద్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రతీ గ్రామంలో కళ్యాణ మహోత్సవాలను పురస్కరించుకొని గ్రామస్తులకు భారీ అన్నసమారాధనలు భారీగా నిర్వహించారు.

నర్సీపట్నంలో... నర్సీపట్నం మున్సిపాలిటీలో శ్రీరామనవమి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. పీనారిపాలెం యూత్ ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. సీతారాములకు కళ్యాణోత్సవాలను రెండవ వార్డులో ఊరేగింపుగా రామాలయం వద్ద కళ్యాణం నిర్వహించారు. వర్షిని వారందరికి పదపప్పు, పానకాలు ఇచ్చారు. అనంతరం భారీ ఎత్తున అన్నసమారాధన చేశారు. ఈ కార్యక్రమంలో రెండవ వార్డు మెంబర్ లాలం వరహాలమ్మ, లాలం మురళీ, శ్రీకాంత్, రాజేశ్వరరావు, కె.నారాయణ మూర్తి, గరగ శ్రీను, పీనారిపాలెం యూత్ శంకర్ మరియు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అదే విధంగా రామారావుపేటలో వైసిపి మున్సిపల్ అధ్యక్షులు కోనేటి రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ ఘనంగా సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు.



కళ్యాణంలో పాల్గొన్న ఛైర్‌పర్సన్ రమాకుమారి దంపతులు

కోటవురట్లలో... మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారిని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, మాజీ ఎంపీపీ గూనూరు పెదకాపు దర్శించుకున్నారు. లక్ష్మపురంలోని నాలుగు రామాలయాల్లో కళ్యాణ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. గొటివాడ, అంబేడ్కరపురం గ్రామాలలో కళ్యాణ వేడుకలు అనంతరం భారీ అన్నసమారాధనలు నిర్వహించారు. పలు గ్రామాలలో ఉత్సవ మూర్తులను ప్రత్యేక పల్లకీల్లో ఊరేగించారు.

బుచ్చెయ్యపేటలో... మండలంలో ఆదివారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామగ్రామాన వెలసియున్న ఆలయాలలో సీతారాముల కళ్యాణవేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుండే భక్తులు ఆలయాలకు తరలివచ్చి పూజలు నిర్వహించారు. మధ్యాహ్న సమయంలో అభిజిత్ లగ్నమందు సీతారాముల కల్యాణవేడుకలను శాస్త్రోక్తం నిర్వహించారు. వేడుకలను కనులారా తిలకించేందుకు భక్తులు ఆయా గ్రామాలలోని ఆలయాలకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. శ్రీరామనవమి వేడుకలు సందర్భంగా గ్రామాలలో ఆధ్యాత్మిక వెల్లివిరిసింది. భక్తులు తన్మయత్వంతో ఈ వేడుకలలో పాల్గొన్నారు. ఐటీవల పునర్నిర్మించిన మంగళాపురం, చినమన్నపల్లి పాలెం ఆలయాలతోపాటు, వడ్డాది పంచాయితీ కార్యాలయం వద్ద ఉన్న రామాలింగేశ్వరాలయం, ఎర్రకాలువ, కోమలిమి, వడ్డాది, గొట్లివీధి ఆలయాల వద్ద, విజయరామరాజుపేట, బంగారుమెట్ట, రాజాం, బుచ్చెయ్యపేట, తదితర గ్రామాలలో ఉన్న సీతారాముల కళ్యాణవేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. పలువేదాలయాలలో ఉగాది నుండి శ్రీరామనవమి వరకు వసంత నవరాత్రి మహోత్సవాలు నిర్వహించారు.



పట్టణంలో తాకాశీవీధి శ్రీనూకాలమ్మవారిని కొత్త అమావాస్య జాతరలో భాగంగా ఆదివారం ఉదయం పరపాకా భాస్కరరావు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ తాకాశి ఉమామహేశ్వరరావు (బాబు) భాస్కరరావుకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శాలువాతో సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో తాకాశి సత్యంరాజ్, గొల్లివిల్లి కోటేశ్వరరావు, ఒమ్మి రాము యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

-న్యూస్‌లీడర్, అనకాపల్లి టౌన్



ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీనూకాంబిక అమ్మవారిని ఆదివారం ఉదయం ఇడా ఎస్టేట్ అధికారి వసంతరాయుడు దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా వసంతరాయుడు దంపతులకు ఆలయ మర్యాదలతో అసిస్టెంట్ కమిషనర్ సుజాత, ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. అభివృద్ధి కమిటీ సభ్యులు మళ్ల సురేంద్ర వసంతరాయుడు దంపతులను శాలువాతో సత్కరించి అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు.

-న్యూస్‌లీడర్, అనకాపల్లి టౌన్


వృద్ధులను ఆదుకోవాలి

అనకాపల్లి, న్యూస్‌లీడర్: పట్టణంలోని గవరపాలెం వీవీ రమణ రైతు భారతి కళ్యాణ మండపంలో విశాఖజిల్లా గ్రామీణ వయోవృద్ధుల సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు కాంట్రీగుల అప్పారావు అధ్యక్షత వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రిటైర్డు గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు బుద్ద వెంకట రామ అప్పారావు మాట్లాడుతూ పిల్లల ఉన్నతి కోసం కృషిచేసిన పెద్దలు వృద్ధాప్యంలో నిర్లక్ష్యానికి గురవుతున్నారన్నారు. వృద్ధుల సమస్యల దృష్ట్యా ప్రభుత్వం వృద్ధులకు సౌకర్యాలు, రాయితీలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎ.శ్యామసుందర్, కర్రి జగ్గ అప్పారావు, పొలిమేర అప్పారావు, మరిసా అప్పారావు, బొద్దేడ వీరునాయుడు పాల్గొన్నారు.

27న శ్రీవరహాలక్ష్మి నృసింహస్వామి కళ్యాణం

కశింకోట, న్యూస్‌లీడర్: కశింకోట శివాలయం వీధిలో శ్రీవరహాలక్ష్మి నృసింహస్వామి కళ్యాణం ఈ నెల 27వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు అద్దిరి సత్యవెంకట కేశవ కొండంరాజు తెలిపారు. అర్బన్ఏపీ ఛైర్మన్ మలసాల రమణారావు దంపతులు ధనమ్మతో కళ్యాణం జరిపించనున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ వేద పండితులతో 27వ తేదీన మంగళవారం రాత్రి ఏడు గంటల నుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనునట్లు తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి మేళతాళాలతో స్వామి రథోత్సవం జరపనుంది తెలిపారు. ఏప్రిల్ ఒకటిన రాత్రి ఏడుగంటలకు సింహాద్రి అప్పన్నకు పుష్పాంజలి, ఏప్రిల్ 18 బుధవారం అక్షయ తృతీయరోజున వరహాలక్ష్మి నృసింహస్వామికి నిజరూప దర్శనం ఉంటుందన్నారు. 27న జరిగే స్వామివారి కళ్యాణానికి భక్తులు పోటెత్తే ప్రసాదాలు కృపకు పాత్రులు కావాలన్నారు.

ఈగలు నివారణకు చర్యలు తీసుకోవాలి



కశింకోట, న్యూస్‌లీడర్: కశింకోటలో కోళ్లఫారం కారణంగా ఈగలు అధికంగా ఉన్నాయని నూతనంగా వేస స్థానం కాలనీ వాసులు ఆదివారం పార్టీ వద్ద ఆందోళన చేశారు. ఈగల నివారించాలని కాలనీవాసులందరూ కలిసి పార్టీ యాజమాన్యాన్ని నిలదీశారు. ఈగలు వలన పిల్లలకు పలు వ్యాధులు సోకుతున్నాయని, వాటిని నివారించాలని కోరారు. పార్టీ యాజమాన్యం ఐదు రోజుల సమయం కోరగా, ఈగలు నివారణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఐదు రోజుల్లో నివారించకపోతే సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని కాలనీవాసులు యాజమాన్యానికి తెలిపారు. ఈ సంఘటన స్థలానికి టీడీపీ మాజీ వైస్ ఎంపీపీ నేగి గోపీకృష్ణ, శెట్టి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం విజయోత్సవ యాత్ర



తుమ్మపాల (అనకాపల్లి), న్యూస్‌లీడర్: చర్చిల్లో మట్టల ఆదివారం విజయోత్సవ యాత్ర ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పాత బస్టాండ్ కాలనీలో మన్నా చర్చిలో పాస్టర్ సిహెచ్ దేవరాజ్ ఆధ్వర్యంలో మట్టల ఆదివారం వేడుకలు నిర్వహించారు. దీనిలో భాగంగా ఈత మట్టలు పట్టుకొని పురవీధులలో ర్యాలీ నిర్వహిస్తూ ఏసు ప్రభువు సందేశాలను కరపత్రాల రూపంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చిన్న పిల్లలు, పెద్దలు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ అధ్యక్షుడుగా శ్రీనాధు శ్రీనివాసరావు

మాడుగుల, న్యూస్‌లీడర్: మోదకొండమ్మ ఆలయ కమిటీ సభ్యులు, డిస్ట్రిక్ట్ కళాశాల ఛైర్మన్ శ్రీనాధు శ్రీనివాసరావు ఆదివారం సాయంత్రం వాసవీ ఇంటర్నేషనల్ క్లబ్ మాడుగులశాఖ అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. పాత కిరోసిన్ బంకు వద్ద భారీ సభ ఏర్పాటు చేశారు. వాసవీ ఇంటర్నేషనల్ క్లబ్ ఛైర్మన్ పుట్టా మురళీకృష్ణ, కోశాధికారిగా జాగారి వెంకటరమణ, ఉపాధ్యక్షులుగా శ్రీనాధు నారాయణరావు, సహాయ కార్యదర్శిగా మామిడి శ్రీనివాసరావు, ప్రొజెక్టు ఛైర్మన్‌గా కుక్కల శ్రీధర్ నియమితులయ్యారు. వీరితో పాటు వాసవీ ఇంటర్నేషనల్ క్లబ్ సభ్యులు 20మంది కలిసి వీరంతా ఆదివారం సాయంత్రం ప్రమాణ స్వీకారం చేయ నున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వాసవీ క్లబ్ ప్రముఖులు ఐదర్ల శ్రీనివాసరావు, డాక్టర్ సీహెచ్ కుమార్, కంబాల శేషగిరిరావు, ఎం.రమేశుకుమార్, పి.సునీల్‌కుమార్, ఎం.రాము హాజరవుతున్నారని నూతన అధ్యక్షులు శ్రీనివాసరావు తెలిపారు.

26న శ్రీసీతారాముల కళ్యాణం

అనకాపల్లి టౌన్, న్యూస్‌లీడర్: పూడిమడక రోడ్డు రామాలయం నందు సోమవారం ఉదయం 9.45 నిముషాలకు శ్రీసీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు బొద్దేడ రాజుబాబు, మళ్ల జగన్మోహన్, బొద్దేడ సన్యాసిరావు, బొద్దేడ సత్తిబాబు, బొద్దేడ దేవుడు, మళ్ల రమణ అప్పారావు తెలిపారు. శ్రీసీతారాములవారి కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ చంద్రశేఖర్, జ్యోతి దంపతులు పాల్గొంటారని వీరు తెలిపారు. కళ్యాణం అనంతరం అదే రోజు మధ్యాహ్నం 12గంటల నుంచి భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. 27మంగళవారం సాయంత్రం ఆరుగంటలకు సారె ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు వీరు తెలిపారు. శ్రీసీతారాముల కళ్యాణ మహోత్సవాలు సందర్భంగా ఆదివారం సాయంత్రం నిర్వాహకులు బొద్దేడ కిరణ్ దేవస్య ఆజారి రాజుల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా ట్రాఫిక్ సీఐ ఎస్.కుమార్ హాజరై పోటీలలో గెలుపొందిన మహిళలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు 42 కన్సొలేషన్ బహుమతులను సీఐ కిరణ్‌కుమార్ చేతులమీదుగా అందజేశారు.

ఆభయాంజనేయస్వామి ఆలయంలో... పట్టణంలోని శారదానది ఒడ్డు గల శ్రీఅభయాంజనేయస్వామి ఆలయం వద్ద సోమవారం మధ్యాహ్నం 12గంటలకు శ్రీసీతారాములవారి కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు కస్పిపల్లి సూర్యప్రకాశరావు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

గవరపాలెం శ్రీగౌరీపరమేశ్వరుల ఆలయంలో... పట్టణంలోని గవరపాలెం శ్రీగౌరీపరమేశ్వరుల ఆలయం ఆవరణలో శ్రీసీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఛైర్మన్ కర్రి సన్యాసినాయుడు తెలిపారు. సోమవారం 11గంటలకు కళ్యాణ మహోత్సవాన్ని మళ్ల సాంబశివరావు దంపతులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అదే రోజు సాయంత్రం ఐదు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు శ్రీగౌరీశ్వర మహిళా మండలిచారిచే శ్రీరామాయణ సంకీర్తన కార్యక్రమాన్ని జరిగించడం జరిగింది.



ముగ్గుల పోటీలను తిలకిస్తున్న ట్రాఫిక్ సీఐ కిరణ్‌కుమార్

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

సీఐ హిమబిందు

మధురవాడ, న్యూస్‌లీడర్: ప్రతీ ఒక్క వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షిత ప్రయాణం కొనసాగించాలని పీఎం పాలెం ట్రాఫిక్ సీఐ ఎస్ హిమబిందు అన్నారు. ఆదివారం ఆనందపురం, వేములపాలెం, మార్కెట్ యార్డు వద్ద ట్రాఫిక్ రద్దీపై సిబ్బందితో పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క ఆటో డ్రైవర్ నిబంధనల ప్రకారం వాహనానికి సంబంధించి పత్రాలతో పాటు ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాహనాలు నడపాలని సూచించారు. ప్రధానంగా ఆటోలు రోడ్లపై నిలిపివేత చేయరాదని దూరంగా రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చని తెలిపారు. వాహనాలు నిలుపుదల చేసేటప్పుడు తప్పనిసరిగా వెనుక, ముందు చూసి నిలుపుదల చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు. తప్పనిసరిగా డ్రైవింగ్‌లైసెన్సు ఉండాలన్నారు. కార్యక్రమంలో పీఎం పాలెం ట్రాఫిక్ ఎస్సై ఆర్ ఆర్ వర్ధనరావు, భీమిలి ఎస్సై సిహెచ్ రాంబాబు, అరిలోవ ఎస్సై సురేష్ సిబ్బంది పాల్గొన్నారు.



27న గంజాయి వాహనాల వేలం

రావికమతం, న్యూస్‌లీడర్: కొత్తకోట సర్కిల్ పరిధిలోని రావికమతం, కొత్తకోట, రోలుగుంట, మాకవరపాలెం స్టేషన్లలో గంజాయి, ఇతర కేసుల్లో పట్టుబడ్డ వాహనాలను ఈ నెల 27న నర్సీపట్నం పోలీసు గ్రౌండ్స్‌లో వేలం వేస్తున్నట్లు కొత్తకోట సిఐ జి.కోటేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ విశాఖ ఎఎస్‌జే కోర్టు ఉత్తర్వుల మేరకు డిడిని కమిటీ, మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టరు, తహశీల్దారు సమక్షంలో జరిగే ఈ వేలంలో ఎవరైనా పాల్గొనవచ్చని తెలిపారు. వివరాలకు 9440796080 నంబరులో సంప్రదించాలన్నారు.

27 నుంచి యోగా శిక్షణ తరగతులు

మాడుగుల, న్యూస్‌లీడర్: ఈ నెల 27వ తేదీ ఉదయం ఐదు గంటల నుంచి మాడుగుల పంచాయితీ సామాజిక భవనంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్‌లో యోగా శిక్షణ తరగతులు ఏర్పాటు చేశామని భారత నిర్మాణసేన సభ్యులు గౌరీశెట్టి మహేష్‌కుమార్ ఆదివారం ఉదయం తెలిపారు. ఈ కార్యక్రమానికి స్త్రీలు, పురుషులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. యోగా దేహం దాల్చా మానసిక ప్రశాంతత ఏర్పడుతుందని, దీర్ఘకాలిక వ్యాధులు తగ్గుతాయని ఆయన తెలిపారు.


ఎన్‌ఎంఎంఎస్‌కు నలుగురు విద్యార్థులు

రావికమతం, న్యూస్‌లీడర్: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్)కు కొత్తకోట హైస్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. కేంద్ర ప్రభుత్వ మానవ వనరులశాఖ ఈ పరీక్షను ఏటా నవంబర్‌లో నిర్వహిస్తుంది. కొత్తకోట హైస్కూల్ నుంచి ఐదుగురు విద్యార్థులు పరీక్షలు రాయగా కోటకొమలి, జనపరెడ్డి వాను, జి.రాజ్‌కుమార్, ఎస్.ఇందును ఎంపికైనట్లు హైస్కూల్ హెచ్ఎం డి.మాధవి తెలిపారు.

27న వారపు సంతల్లో ఆశీల వసూళ్లకు వేలం

రోలుగుంట, న్యూస్‌లీడర్: రోలుగుంట, బుచ్చెంపేట వారపు సంతలకు ఈ నెల 27వ తేదీన బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ. శరీనీవి తెలిపారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయా గ్రామాల్లో 01.04.18 నుంచి 31.3.19 వరకు ఆశీలు వసూలుకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పాటల్లో పాల్గొనే వారు ఆయా పంచాయతీలకు రూ.6వేలు డిపాజిట్టు చెల్లించాలన్నారు.

డైట్‌లో పాస్‌పోర్టు మేళా



అభినందనలు తెలుపుతున్న రత్నాకర్

అనకాపల్లి, న్యూస్‌లీడర్: పట్టణంలోని దాడి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో పాస్‌పోర్టు మేళా నిర్వహించారు. విశాఖపట్నం పాస్‌పోర్టు ఆఫీసు నుండి అసిస్టెంట్ పాస్‌పోర్టు అధికారి రేజీనా‌ఎన్‌టీ ప్రసాద్, ఎస్.రాధాకృష్ణ సిబ్బంది కళాశాలకు విచ్చేసి సుమారు 800 మంది ఇంజనీరింగ్, ఎంబీఏ విద్యార్థులకు తక్షణమే పాస్‌పోర్టు ఇచ్చే విధంగా ఆన్‌లైన్‌లో విద్యార్థుల ధృవపత్రాలను పరిశీలించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టారు. ఇప్పుడు జరిగింది. బుకింగ్ స్లాట్ ప్రకారం విద్యార్థులు వారి యొక్క ఒరిజినల్ ధృవపత్రాలను తీసుకొని ఈ నెల 26, 27తేదీలలో పాస్‌పోర్టు ఆఫీసుకు వెళ్లి తమ పాస్‌పోర్టును పొందవచ్చని అధికారులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సౌకర్యాన్ని వందలాది మంది విద్యార్థులకు అందజేసినందుకు ముఖ్యంగా విశాఖపట్నం పాస్‌పోర్టు అధికారులకు కళాశాల కరస్పాండెంట్ దాడి రత్నాకర్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని గత మూడు రోజులుగా వివిధ తరగతుల ట్రైన్ టీచర్లు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పీఏ మురళీ సంయుక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ ప్రభాకరరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ ఈశ్వరరావు, డీన్ అకాడెమిక్ డాక్టర్ రామారావు పర్యవేక్షణలో నిర్వహించారు.

సంచలన వార్తాపత్రిక
లీడర్ ఉత్తరాంధ్ర జోన్

6

విశాఖపట్నం

సోమవారం 26-3-2018

చర్మవాధులపై అవగాహన

విజయనగరం, న్యూస్‌లీడర్ : జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఫూల్‌బాగ్ గిలో నిర్వహిస్తున్న ఏడురోజుల మెగావర్క్ క్యాంప్‌లో ఫూల్‌బాగ్ జడ్పీ హైస్కూల్‌లో మెగా చర్మ వైద్య శిబిరం జరిగిందని నిర్వాహక కన్వీనర్ జిల్లా ప్రోగ్రాం అధికారి డా.ఎస్‌వీఎస్ సూర్యనారాయణ తెలిపారు. కాలనీలో గల ప్రజలకు, పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు చర్మ సంబంధమైన వ్యాధులకు, సమస్యలకు డా.శ్రీహర్ష బృందం వైద్య సలహాలు సూచనలు అందజేయడం జరిగింది. సుమారు 400మందికి పరీక్షలు నిర్వహించడం జరిగిందని జిల్లా ప్రోగ్రాం డా.ఎస్‌వీఎస్ సూర్యనారాయణతెలిపారు.

సంస్కృతిని వ్యాప్తిచేయడానికి

ఆంగ్ల భాష వారధి

రెక్టార్ ఆచార్య కె.గాయిత్రి దేవి



ప్రసంగిస్తున్న రెక్టార్ ఆచార్య గాయిత్రిదేవి

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను ప్రపంచ వ్యాప్తం చేయ డానికి ఆంగ్ల భాష వారధిగా నిలుస్తుందని ఏయూ రెక్టార్ ఆచార్య కె.గాయిత్రి దేవి అన్నారు. ఆంధ్రప్రదేశ్ సైలంబర్స్‌ల ఫెడరేషన్‌లో నిర్వహించిన సాఫ్ట్ స్కిల్స్, లైఫ్‌స్కిల్స్ అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆంగ్ల భాష సముపార్జన ఉపాధిని పొందడానికి మాత్రమే కాదన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం సాఫ్ట్‌స్కిల్స్, లైఫ్ స్కిల్స్‌కు అత్యంత ప్రాధాన్యం ఉందన్నారు. ఏయూ సాఫ్ట్‌స్కిల్స్ శిక్షకుడు చల్లా కృష్ణవీర్ అభిషేక్, సైలంబర్స్‌ల ఫెడరేషన్ అధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు, జోస్యుల సురేష్, డాక్టర్ కె.శాంతి, చైతన్య తదితరులు ప్రసంగించారు

హనుమ సంస్కార సంపన్నుడు

వారణాశి వెంకటేశ్వర శర్మ



ఎస్‌కోట, న్యూస్‌లీడర్ : హనుమ సంస్కార సంపన్నుడని ఆధ్యాత్మికవేత్త, గాయత్రి విద్యా పరిషత్ అధ్యాపకులు వారణాశి వెంకటేశ్వర శర్మ అన్నారు. విజయనగరం జిల్లా ఎల్.కోట మండలం శ్రీరాంపురం గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీరామ నవమి ఉత్సవాలలో ఆయన సుందరకాండపై ప్రవచనం చేశారు. మానవ ప్రయత్నానికి భగవత్ అనుగ్రహం తోడయితే కార్య సాఫల్యం అవుతుందని హనుమ రుజువు చేసారన్నారు. మనోదీక్ష, మనో సంకల్పం, సహనం ఇబ్బందులను అధిగమింపచేయడానికి ఉపకరిస్తాయన్నారు. మనస్సే సాధనంగా, శ్రీరామచంద్రుని అనుగ్రహమే బలంగా హనుమ సముద్రాన్ని దాటి లంకకు చేరారన్నారు. ముందుగా తన గురువైన సూర్యుని నమస్కరించి హనుమ తన ప్రయాణాన్ని ప్రారంభించారన్నారు. అనంతరం ప్రసాద వితరణ జరిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఉపాధ్యక్షురాలు వడ్డమాని కామేశ్వరమ్మ, వేదుల సోమేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు. పెద్దసంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొని రామాయణ ప్రవచనాన్ని విన్నారు.

జర్నలిస్టుల ఛలో అమరావతికి తరలి రావాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గంట్ల శ్రీనుబాబు

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : ఏపీ జర్నలిస్టుల సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం విజయవాడలో జరిగే పదేళ్ల పండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి విశాఖ నుంచి 150మంది జర్నలిస్టులు తరలివెళుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సీఎం చంద్రబాబునాయుడు జర్నలిస్టులకు హామీ ఇచ్చిన శ్రీవెల్‌కమ్ ఇళ్ల పనులు తక్షణమే ప్రారంభించాలని, అలాగే జర్నలిస్టులకు పింఛన్ సదుపాయం కల్పించాలని వంటి పలు డిమాండ్లతో ఛలో అమరావతి కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. సోమవారం విజయవాడ బెంజ్ సెంటర్ నుంచి తుమ్మలపల్లి కళాక్షేత్రం వరకు వేలాది మంది జర్నలిస్టులతో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే పదేళ్ల సంబరాలు నిర్వహిస్తామని ఈ సంబరాల్లో పలువురు మంత్రులు, రాజకీయ నేతలు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు పి.నారాయణ, కార్యదర్శి అనురాధ, రవికుమార్ సొంపరావు, ఈశ్వరరావు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టమాటా రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



కూరగాయలు పంపిణీ చేస్తున్న సంస్థ సభ్యులు

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : స్థానిక వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పేదలకు ఉచితంగా టమాటాలు, వంకాయలు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు మాట్లాడుతూ వంకాయలు, టమాటా రైతులకు కనీసం రవాణా చార్జీలు కూడ రావట్లేదని వారు నష్టాల్లో వున్నారని వారిని గవర్నమెంటు ఆదుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, భానోజీరావు, ఎల్లారావు, సత్తిబాబు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు

ఘనంగా గురు పూజ మహోత్సం



పెదగంట్యాడ, న్యూస్‌లీడర్ : పెదగంట్యాడ శ్రీబాలగోరి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బాల గోరి ఫంక్షన్‌హాల్లో 91వ గురుపాదుకా పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పతాక ఆవిష్కరణ, గురుపూజా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిప్పల నాగిరెడ్డి, గురువులు లక్ష్మణభక్తు, బాలగోరి ట్రస్ట్ అధ్యక్షుడు పిపి నాగేశ్వరరావు, పి.శంకరరావు పాల్గొన్నారు.

పవన్ కో దండం

అశోక్ గజపతి రాజు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అశోక్ గజపతిరాజు

విజయనగరం, న్యూస్‌లీడర్ : జాతీయ పార్టీలకు రోగాలొచ్చాయని, కేంద్రంలో బాధ్యత గల ప్రభుత్వం ఉండనిపించడం లేదని కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతి రాజు వ్యాఖ్యానించారు. రాజకీయంగా జాతీయ పార్టీలకు వేరే ఎజెండాలుంటాయని, ఏపీ ప్రయోజనాల గురించి అవి స్పందిస్తాయని తాను అనుకోవడం లేదని ఆయనన్నారు. కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన తర్వాత ఆయన తొలిసారిగా శనివారం జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్డీయే నుంచి బయటకు రావాలన్న నిర్ణయం విరుద్ధం కాదన్నారు. తెలుగు జాతి జోలి పట్టడం లేదని, ధర్మం నిర్వర్తించమని మాత్రమే కేంద్రాన్ని అడుగుతోందన్నారు. తెలుగు జాతిని గిల్లితే వారి ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి పదేళ్ళ టైమ్ ఉందని కేంద్రం అనడం సబబు కాదన్నారు. తాము ఎవరి హెచ్చరికలకూ లొంగేది లేదని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అవినీతి కేసుల పరిష్కారం ఏడాది లోగా పూర్తి కావాలనే అంశం ఎందుకు మరుగున పడిందో అర్థం కావడం లేదన్నారు. రాజధాని నిర్మాణం కోసం రైతులు 33 వేల ఎకరాలు ఇవ్వడం చాలా గొప్ప విషయమన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే ఏపీలో వృద్ధి రేటు అధికంగా ఉందన్నారు. పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై విలేఖరులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ ఆయనకో దణ్ణం అని వ్యాఖ్యానించారు. పవన్ కళ్యాణ్ గురించి తాను ఎక్కువ మాట్లాడబోనని అంటూనే తాము ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజల్లోకి రావడం లేదని, ఓడిపోయినా ప్రజల మధ్యే ఉంటామని వ్యాఖ్యానించారు. జాతీయ ప్రాజెక్ట్ పోలవరం భూ సేకరణకు రాష్ట్రం నిధులివ్వాలని ఆయన అనడాన్ని అశోక్‌గజపతి ఆక్షేపించారు. రాష్ట్రం ఇబ్బందుల్లో ఉన్నప్పుడు అర్థ రహితమైన ప్రకటనలు చేయడం సమంజసం కాదన్న అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ డాక్టర్ శోభా స్వాతీరాణి, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మహంతి చిన్నంనాయుడు, ప్రధాన కార్యదర్శి ఐవీపీ రాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు బొద్దుల నరసింగరావు, తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు శోభా హైమావతి, పార్టీ నాయకులు కర్రోతు వెంకట నరసింగరావు, కరణం శివరామ కృష్ణ, కలిశెట్టి అప్పలనాయుడు తదితరులు విలేఖరుల సమావేశంలో పాల్గొన్నారు.

రామాయణం ద్వారే స్త్రీమూర్తికి ప్రాధాన్యత

ప్రవచనకారులు మైలవరపు శ్రీనివాసరావు



సత్సంగ సమావేశంలో ప్రసంగిస్తున్న శ్రీనివాసరావు

కోటబొమ్మాళి, న్యూస్‌లీడర్: స్త్రీ మూర్తికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చిన ఇతిహాసం రామాయణమని ప్రవచన బ్రహ్మ డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు అన్నారు. మండలంలో గల ఊటికలపాడు శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా శ్రీరామ మందిరంలో నిర్వహించిన సత్సంగ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్సంగ సమావేశానికి వచ్చిన భక్తులకు శ్రీరామనవమి విశిష్ఠతగూర్చి వివరించారు. శ్రీరాముడు గూర్చి వివరిస్తూ రామ శబ్దంలోని "రా" అను వర్ణము సుచ్చరించినచో మన శరీరము నుంచి పాపములు బయటకు పోవును, "మ" కారము ఉచ్చరించినచో అవి మరల లోనికి ప్రవేశించవన్నారు. అలాగే భక్తి అంటే గొంతు పోయేలా చేసే భజనలు కాదు, నెట్టుకుంటూ ఇతరులను తిట్టుకుంటూ చేసుకొనే దర్శనం కాదు, కడుపు మాడ్చుకొని చేసే ఉపవాసం కాదు, పిండి వంటలు మొత్తం ముందుంచి కోరికలతోయాచించడంకాదు, వారాలు తిథులు నీకు లాభం చేకూరే రోజు వెళ్ళి మొక్కే మొక్కులు కాదు, భక్తి అంటే భగవంతుడికి నిన్ను నువ్వు సమర్పించుకోవడం, ఏది జరిగినా నీ మంచికే అనుకొని నీ చుట్టూ ఉన్న సమాజం మంచి కోరడమేనన్నారు. అనంతరం ఉప్పాడ పెద్ద అప్పలనాయుడు, బొడ్డేపల్లి పాపారావు దంపతులు శ్రీనివాసరావుగారిని సన్మానించారు. అలాగే సత్సంగ సమావేశానికి హాజరైన భక్తులకు అన్నప్రసాదం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు సునరావు చంద్రశేఖరశర్మ, ఆలయ ధర్మకర్త సనపల కరుణకుమార్, సర్పంచ్ గొండు లక్ష్మణరావు, బమ్మిడి మధు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

మండలంలో కానరాని చలివేంద్రాలు

కోటబొమ్మాళి, న్యూస్‌లీడర్ : వేసవి తీవ్రత ముదురుతున్న దృష్ట్యా ప్రజలు వడ దెబ్బకుగురికాకుండ జాగ్రత్త వహించాలని, అలాగే ప్రజాప్రతినిధులు, అధికారులు జనాలు ఎక్కువగా ఉండే చోట చలివేంద్రాలు ఏర్పాటు చేసి, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం పిలుపు నిచ్చినా కోటబొమ్మాళి మండలంలో ఎక్కడా వాటిని ఏర్పాటు చేసిన దాఖలాలు కనిపించటంలేదు. గతంలో మార్చినెల నుండే బస్‌స్టాపులవద్ద, మార్కెట్‌లోను, పాఠశాలల వద్దను, సర్పంచ్‌లు, యువజన సంఘాలు పోటీపోటీగా చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. కానీ ఈ ఏడాది మార్చి నెల చివరి వారంలోకి అడుగుపెట్టినా కాని ఎక్కడ చలివేంద్రాలు కానరావటం లేదు. మండలంలో గడిచిన 10 రోజులుగా ఎండ వేడిమి, వడగాల్పులు, ఎక్కువగా ఉన్నాయి. దీంతో ఉదయం 10గంటలు దాటిన తరువాత బయటకు వచ్చేందుకు ప్రజలు భయపడుతున్నారు. వాతావరణం ఇంత దారుణంగా ఉన్నప్పటికీ ప్రజలకు ఉపకరించే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు చలివేంద్రాలు, మజ్జిగ సరఫరా చేయటంలేదని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర రవాణాశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చొరవచూపి తమ సొంత మండలంలోనైనా సర్పంచ్‌లు ,అధికారులకు సూచనలు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

జాయింట్ కలెక్టర్ శ్రీకేష్ లఠ్కర్‌కు సత్కారం



జేసీని సత్కరిస్తున్న సమితి సభ్యులు

విజయనగరం, న్యూస్‌లీడర్ : ప్రజలకు సేవలందించి బదిలీపై వెళుతున్న నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ శ్రీకేష్ బాలాజీ లఠ్కర్‌ను తెలుగు భాషా పరిరక్షణ సమితి సత్కరించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళలకు, సంప్రదాయాలకు పుట్టినిల్లు అయిన విజయనగరంలో పనిచేయడం తనకు సంతృప్తినిచ్చిందని అన్నారు. సంక్రాంతి, ఉగాది వంటి సంబరాలు నిర్వహించడంలోనే గాక గురజాడ జయంత్యోత్సవం వంటి తెలుగుభాష పరిరక్షణకు కృషి చేసినందుకు జాయింట్ కలెక్టర్‌కు కృతజ్ఞతలను తెలిపి తెలుగుభాషా పరిరక్షణ సమితి అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్, ఉపాధ్యక్షులు పిస్పింటి సూర్యనారాయణ, భారతీయజనతాపార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు బవిరెడ్డి శివప్రసాదరెడ్డి సత్కరించారు.

అసత్య ఆరోపణలు తగదు

బిజెపి జిల్లా ప్రచార కమిటీ కన్వీనర్ కుసుమంచి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కుసుమంచి

విజయనగరం, న్యూస్‌లీడర్ : భారతీయ జనతా పార్టీ పాలనపై పలు రాజకీయ పార్టీలు నాయకులు అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని బిజెపి జిల్లా ప్రచార కమిటీ కన్వీనర్ కుసుమంచి సుబ్బారావు హితవు పలికారు. శనివారం ఆయన స్వగృహంలో పత్రికావిలేకరులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కుసుమంచి మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం కేంద్రంలో స్వచ్ఛమైన పారదర్శకంగా పాలన అందిస్తోందని కేవలం పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోరుతూ స్వపరిపాలన అందిస్తోందన్నారు. బిజెపి అంటే ధనిక, భూస్వామ్య రంగాలకు కొమ్ముకాసేపార్టీ, గిట్టదని ఆయన ఘాటుగా సమాధానమిచ్చారు. మెడపట్టుకొని పార్లమెంట్ హాలు నుంచి బయటకు నెట్టేసిన కాంగ్రెస్ నాయకులు దాని మిత్రవర్గాలవారు ఈరోజు ఊసరవెల్లిలా రంగులు మార్చుకుంటూ బిజెపిని విమర్శిస్తున్నంత మాత్రాన ప్రజలకు ఒరిగేదేమీలేదని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బిజెపికే తిరిగి అఖండ విజయం ప్రజలు అందించడానికి ఎదురుచూస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చ పట్టణ అధ్యక్షులు సంతోష్, బిజెపి నాయకులు ఇమంది సురేష్, కాళ్ల సురేష్, వప్పు విశ్వనాథం, శంకరరావు పాల్గొన్నారు.

పేలుడు పదార్థాల రవాణాపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడి



విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాలు

పెందుర్తి, న్యూస్‌లీడర్ : పేలుడు పదార్థాల అక్రమ రవాణాపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడి జరిపారు. ఈ దాడిలో సుమారు రూ.6 లక్షల విలువైన పేలుడు పదార్థాలను స్వాధీనపర్చుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణ రాష్ట్రంలోని భువనగిరి జిల్లా బొమ్మల రామారం గ్రామం నుండి రీజెన్సీస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ వారు విశాఖపట్నంలోని కృష్ణాపురం వైష్ణవి ఎంటర్ ప్రైజెస్‌కు ఎపి16డి 3788 నెంబరు గల ఎక్స్‌ప్లోజివ్ లారీలో పంపించారు. ఈ లారీలో ఎక్స్‌ప్లోజివ్ జిలెటిన్స్ సుమారు 600 బాక్సులలో రవాణా జరుగుతోంది. అయితే వీటిని భువనగిరి నుంచి విశాఖ వరకు మాత్రమే రవాణా చేసేందుకు మాత్రమే అనుమతి ఉంది. ఇతర ప్రాంతాలకు ఈ పేలుడు పదార్థాలను తరలించేందుకు లారీకి రవాణా పత్రాలుగాని, ఎక్స్‌ప్లోజివ్ అనుమతి పత్రాలు గాని లేకుండా తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న విజిలెన్స్ అధికారులు మండలంలోని సోంపురం వద్ద మాటువేసి పట్టుకున్నారు. లారీ డ్రైవర్‌ను విచారించగా వైష్ణవి ఎంటర్‌ప్రైజస్ యజమాని సదరు సరుకుని సోంపురంలో గల హనుమాన్ ఎంటర్‌ప్రైజస్ గోడౌన్‌లో దింపమని చెప్పడంతో సోంపురం తీసుకువచ్చినట్టు చెప్పారన్నారు. అత్యంత శక్తిమంతమైన పేలుడు పదార్థాలను ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా రవాణా చేస్తున్నట్లు భావించి విజిలెన్స్ అధికారులు సదరు సరకును లారీతో స హా స్వాధీనపర్చుకున్నామని చెప్పారు. తదుపరి చర్యలు నిమిత్తం పల్లంపూడి పోలీసులకు అప్పగించారు. ఈ తనిఖీలో విజిలెన్స్ అధికారులు టి.హరికృష్ణ (ఎస్పీ), డిప్యూటీ ఎస్పీ వి.ప్రసాదరావు, సిఐ కె.కృష్ణ, పల్లంపూడి ఎస్ఐ ఎస్.కృష్ణమూర్తి, సిబ్బంది, రెవిన్యూ అధికారులు ప్రేమ్‌కుమార్, విఆర్ఓలు ఎ.వెంకటరావు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ వైద్యుని అవార్డు అందుకున్న నరేష్‌కుమార్



సీతంపేట న్యూస్‌లీడర్ : ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా సీతంపేట డిప్యూటీ డియంహెచ్ ఓ డాక్టర్ నరేష్ కుమార్ కు జిల్లాలో ఉత్తమ వైద్యుడిగా జిల్లా కలెక్టర్ ధనుంజయ రెడ్డి చేతుల మీదుగా శనివారం అందుకున్నారు .శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో శనివారం ఈ అవార్డ్ బహూకరించారు . ఈ సందర్భంగా డాక్టర్ నరేష్ కుమార్ మాట్లాడుతూ ఉత్తమ వైద్యునిగా అవార్డు రావడం చాలా ఆనందంగా ఉందని అన్నారు . ఈ అవార్డు నా బాధ్యతని పెంచిందని గిరిజనులకు మరింత సేవలు అందించేందుకు నూతన ఉత్సాహాన్ని ప్రోత్సాహం చేసేటట్లు ఉందని కొనియాడారు . ఈయనతో పాటు గాయల్.టి గా పనిచేస్తున్న మురళి కు అవార్డు అందజేశారు .

ఆరోగ్యమే మహాభాగ్యం

పోలీస్ కమిషనర్ యోగానంద్



విశాఖపట్నం,న్యూస్‌లీడర్: ఆరోగ్యమే మహాభాగ్యమని ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని నగర పోలీస్ కమిషనర్ టి.యోగానంద్ తెలిపారు. పోలీస్ బ్యారక్స్‌లో పోలీస్ ఉద్యోగుల కు మైక్యూర్ హాస్పటల్స్ ఆధ్వర్యంలో ఆరోగ్యం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన కార్యక్రమాన్ని ప్రారం భించిన అనంతరం మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం ఒత్తిడితో కూడినదని, సమయ భావన పాటించ లేమన్నారు. కావున ఆరోగ్యం కోసం తీసుకోవల్సి జాగ్రత్తలపై అవగా హనతో మెలగాలన్నారు. ఈకార్యక్రమంలో డాక్టర్లు సతీష్‌బాబు, మహేంద్రనాథ్, కల్యాణి, ఏడీసీపీ వి.శ్రీనివాస్, పోలీస్ ఉన్నతాధికారులు అధిక సంఖ్యలో సిబ్బంది పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రాంతంలో శ్రీ సీతారామల కల్యాణ మహోత్సవాలు



మల్కాపురం, న్యూస్‌లీడర్ : పారిశ్రామిక ప్రాంతంలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవము సందర్భంగా ఆది వారం శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాలు 49వ వార్డు మల్కాపురం రెడ్డివీధి ,జాలరి వీధి ,పల్లివీధి ,నూకవీధి ,45వ వార్డు ఏకేసీకాలనీ ,48వ వార్డు ఇండస్ట్రియల్ కాలనీ ,జనతాకాలనీ ,47వ వార్డు నక్కవాని పాలెం 46 వార్డు శ్రీహరిపురం ఓల్డ్ రామా లయంలో స్వామి వారి కల్యాణం నిర్వహించారు .

క్షయవ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

సంయుక్త కలెక్టర్-2 నాగేశ్వరరావు

విజయనగరం, న్యూస్‌లీడర్ : జిల్లాను క్షయవ్యాధిరహిత జిల్లాగా తీర్చిదిద్దానికి అందరూ కృషి చేయాలని సంయుక్త కలెక్టర్-2 కె.నాగేశ్వరరావు అన్నారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గరవున్న మీసేవ కేంద్రం నుంచి బయలుదేరే ర్యాలీకి జెసి-2 జెండాఊపి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా సంయుక్తకలెక్టర్ -2 మాట్లాడుతూ క్షయవ్యాధి రాకుండా ఉండేందుకు తీసుకోవలసిన ముందుజాగ్రత్తలు గురించి మరింత విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. వ్యాధి సోకిన వారు వైద్యుని సలహా ప్రకారం మందులు వాడాలన్నారు. మందులు వినియోగం ద్వారా వ్యాధిపూర్తిగా నయమవుతుందన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులు దగ్గినపుడు వచ్చే తుంపర్ల ద్వారా క్షయవ్యాధి వ్యాప్తి చెందుతుందని అన్నారు. ఈ కార్య క్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా.వి.వెంకటరావు, డిసిహెచ్‌ఎస్ డా.ఉషశ్రీ జిల్లా క్షయ నివారణాధికారి డా.కె.రవికుమార్, డిఐఓ డా.కిశోర్‌కుమార్, టిబి కంట్రోల్ మెడికల్ ఆఫీసర్ డా.విజయకుమార్, ప్రేమ సమాజం వ్యవస్థాపకులు బుద్ధిరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

దామోదరపురంలో దళిత తేజం



అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం


బొబ్బిలి, న్యూస్‌లీడర్ : నియోజకవర్గం దళిత తేజం తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా బొబ్బిలి నియోజకవర్గం గ్రామంలో మండల ఎస్సీ సెల్ పేర.మురళీధర్ అధ్యక్షతన దళితవాడల్లో పర్యటించి వారి సమస్యలను అడిగి తెలుసు కోవడమైనది. దళితుల అభి వృద్ధి, సంక్షేమం చంద్రన్న తోనే సాధ్యమనే నినాదంతో ప్రభుత్వం దళితులకుచేస్తున్న సంక్షేమ పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర బి సి సెల్ కార్యదర్శి ఎల్.ఎల్ నాయు డు,మండల ప్రత్యేక ఆహ్వానితుడు మర్ల పురుషోత్తం, కోరారు .ఈకార్యక్రమంలో ఎంపీటీసీ సర్వ కృష్ణారావు,సర్పంచు జగదీష్,ఎస్. సీమ రావు,జోగారావు,మరియు మండల పార్టీ నేతలు,జన్మభూమి కమిటీ సభ్యులు, కార్యకర్తలు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



రామునితో పోల్చుకునే అబ్బాయిలు
సీతతో పోల్చుకునే అమ్మాయిలు ఉన్నారు..
కానీ వనవాసం వెళ్తావా అంటే ఒప్పుకునే అబ్బాయిలు
అగ్నిలో దూకుతావా అంటే వినే అమ్మాయిలు ఉండరు.
మంచి క్యారెక్టర్ అనేది ఒకరితో పోల్చుకుంటే రాదు..
అది మనం చేసే పనిని బట్టే అదే వస్తుంది!!

మనిషి

1981లో రచయిత తొలి కథ



సలీమ్

"త్వరగా రావాలి" ఎల్లప్ప చేతిలో డబ్బులుంచుతూ అన్నాను.అతని ఓ కన్ను యాంత్రికంగా డబ్బుని లెక్క పెట్టడంలో మునిగి ఉంటే. రెండో కన్ను 'నా కెందుకు దెబ్బంలో' నిర్లిప్తంగా ఎటో చూస్తోంది. ఎల్లప్పకూ నాకూ- నాకూ ఈ లాడ్జీకి ఉన్న సంబంధం దాదాపు ఐదుయేళ్ళది

నేను ఆఫీస్ పనిమీద నెలకోసారయినా ఇక్కడికి రావడం ఎంత అనివార్యమో-నాకూ ఎల్లప్పకు తెల్సి పోవడం అంత అనివార్యం ఎలా తెలుస్తుందో మరి- నేను వచ్చి కొన్ని క్షణాలైనా కాకముందే నన్ను వెదుక్కుంటూ వచ్చేస్తాడు. సన్నగా - గాలికొడితే ఎగిరిపోయేట్టు ఉంటాడు ఎల్లప్ప. తమాషాగా ఉండే మెల్ల కన్ను - మొహం నిండా అల్లుకున్న గోధుమరపు మచ్చలూ - అసహ్యమైన నవ్వూ

కానీ ఎల్లప్ప నమ్మకమైన వ్యక్తి - సక్రమమైన మార్గంలో వెళ్ళే వాళ్ళ విషయం నాకు తెలీదుగానీ చట్టవిరుద్ధమో, అక్రమమో అయిన పనులచేసే వాళ్ళకు కావల్సింది "నమ్మకమైన" వ్యక్తులే.

"రాత్రికి తోడు కావాలా సార్ కొత్త సరుకుంది"

ఎల్లప్ప డబ్బుని జాగ్రత్తగా జేబులో పెట్టుకుంటూ చాలా యథాలాపంగా అడిగాడు. ఇన్నేళ్ళ పరిచయమున్నా ఈ విషయం అడిగేటప్పుడు మాత్రం ఎల్లప్ప తన బిజినెస్ ట్రిక్స్‌ని మర్చిపోడు.

చాలా తగ్గు స్వరంతో "కొత్తసరుకు అనే పదాల్ని వత్తి పలుకుతో చెప్తాడు అలా అన్నప్పుడల్లా "అది నిజం నమ్మమన్నట్టు చూస్తుంది మంచి కన్ను" "ఈ పాపం నాకు చేరికి లెమ్మంలో" ఏ గోడవైపుకో తిరిగిపోతుంది మెల్ల కన్ను. మనం కొద్దిగా ఉత్సాహం చూపామా విశేషణాల వర్షం కురిపిస్తాడు పిల్ల వెన్నముద్దలాగో బుజ్జి మల్లెలాగో ఉంటుందంటాడు పదహారేళ్ళకన్నా వది సెకన్లయినా ఎక్కువ వయసు ఉండదని అంటాడు. ఆ ఎత్తుపల్లాలు ముందు రతీదేవి. రంభా ఊర్వశులు దిక్కుమాల్సిందే నంటో పందెం కడతాడు వివరికొలాగుంతేనేం ఒక్కసారి డబ్బులాగా వచ్చేటప్పటికి దాని చెంతన మీదా- పెరిగే ధరలమీదా అందుకనే ఆనందమూ అయిన ఖర్చుల నిష్పత్తులతో సహా మాట్లాడి మీ చేత ఓకే అన్పించేస్తాడు.

ఎల్లప్ప యెన్నుకున్న ఈ ఉద్యోగం జీవనవిధానంలోది రాజులూ రాజ్యాలూ మారినా వేషధారులూ పరిస్థితులూ మారినా జీవన విధానంలో గుణాత్మకమైన మార్పులొచ్చినా. అప్పటికీ ఇప్పటికీ మారనిది సరాల ఉనికి.

"సార్ -పిల్లకూరాలా" ఇట్లువచ్చని విక్రమార్కుడిలా ఎల్లప్ప.

"ఈరోజు వద్దులే ఎల్లప్పా ఆఫీస్ పని కొంత మిగిలిపోయింది" ఆ మొహంలో నిరాశ కన్పించింది లేదా అలా అని భ్రమపడి ఉంటాను.ఎల్లప్ప మొహంలో భావాలు చదవడం చాలాకష్టం రెండు కళ్ళు రెండు రకాల భావాల్ని చెప్తాయి. మొహంలో మరో భావం లాంటిదేదో కన్పిస్తుంది. ఈ మూడింటినీ సమన్వయ పరిస్తేనే గాని సరియైన అవగాహనకు రాలేం. మరికొద్ది సేపు నిశ్శబ్దంగా నిలబడ్డాడు ఎల్లప్ప -నన్నలా కన్విన్స్ చేయాలా అని ఆలోచించి ఉంటాడు. బహుశా జవాబు తట్టి ఉండదు. నిశ్శబ్దంగా బైటికెళ్ళిపోయాడు.

లేచి తలుపు గడియ పెట్టేసి - ఫ్యాన్ ఫుల్ స్పీడులో పెట్టి బెడ్‌మీద పడుకున్నా.మామూలుగానే ఆ అమ్మాయి గుర్తొచ్చింది. మొట్టమొదటిసారి ఓ సంవత్సరం క్రితం అను కుంటా చూశాను అదీ ఆ క్షణమే.విశాలమైన చెదల్చారి కళ్ళూ ఏ చిత్రకారుడో అప్రమత్తతతో గీసిన అందమైన రేఖల్లాంటి పెదాలు-గొప్ప వైణికుని ప్రేళ్ళ కొసల నుంచి జాలువారే సమ్మోహన రాగం లాంటి ఆ చిర్నవ్వు. ఈ మధ్య అదోనికే క్యాంప్ కొచ్చే ప్రతీ సారీ నాకా అమ్మాయి గుర్తొస్తోంది. ఫెళ ఫెళ లాడ్తున్న కొత్త కరెన్సీ నోట్లలా... మాసిపోయిన బట్టల్లోనే ఇంతందంగా ఉంటే - సరియైన బట్టల్లో ఇంకెంత అందంగా ఉంటుందో.. ఊహూ.. బట్టల్లోనే ఇంతందంగా ఉంటే- బట్టలేకుండా...

తలుపుమీద చేస్తున్న శబ్దం ఆలోచనని నొక్కేసింది లేచి వెళ్ళి తలుపు తీశాను ఎల్లప్ప- లోపలికి వచ్చి, తలుపు దగ్గరకంటా వేసి కుర్చీ ముందుకు జరిపి. దానిమీద ఉంచాడు బాటిల్ రెప్పి పొట్లం విప్పుతీసి కాగితం మీద సీసా జరుపుతాడు ఫ్యాన్ గాలికి ఎగిరిపోకుండా గ్లాస్ కడిగి ముందుంచాడు.

'తోడు లేకుండా త్రాగడం మొదటిసారిగా చూస్తున్నా సార్' నేలమీద చతికిలబడుతో అన్నాడు ఎల్లప్ప. 'నీవున్నావుగా తోడు' అన్నాను గ్లాసులోకి నీళ్ళు ఒంపుకుంటూ నాకు సోడాలూ- ఐస్ క్యూబులు ఇష్టం ఉండదు.

"ఎన్ని రోజులుంటార్సార్"

"ఏం" అన్నట్లుగా చూశాను కొద్దిగా సిప్ చేస్తే

"ఆ పిల్ల.. రేపు పిల్చుకు వస్తాను"

"వ్యాపారం నేర్పిన ఎల్లప్ప అంత త్వరగా వదిలి పెట్టడని తెల్సు.మూస్ లోపల్ వెర్ర కొద్ది కొద్దిగా తన ప్రభావం చూపిస్తోంది. మత్తుగా.. హాయిగా ఆ పిల్ల ఈ విస్కీ కన్నా మత్తుగా ఉంటుందనుకుంటా.. నా దేహం అన్నీ ఒకేసారి కుప్పగా పోసినట్టు.. అల్లిప్పుల అందమైన కళ్ళూ- ఐరసు ఐకి ఇట్లితంగా తప్పనైన వయసు- గుప్పుకునేలా వక్షం..

ఎల్లప్ప మీద కోపం విరాకూ కల్గాయి.

"నేన్చెప్పిన అమ్మాయి విషయం ఏం చేశావ్" అసహనంగా అడిగినంత పనిచేశాను. "ఎవరూ- ఆ పెద్ద కళ్ళ అమ్మాయిని చెప్తుంటారు -అదేనా.. అదెవత్తోగాని నా ప్రాణం తీస్తుంది సార్ - ఎట్లా ఉంటుందో చెప్తే నా తెల్గ తెలుస్తుంది. ఓ రోజు చూపించండి ఇట్టే లాక్కొస్తాను." ఏదీ? అంత సమయం దొరికితేనా! క్షణంలో కన్పించి.. మాపుట్లో గ్రుడ్డుకొని.. మరుక్షణం మాయమైపోతుంది. అందుకేననుకుంటా అంతాకర్షణ. పళ్ళ నెవరినయినా అడుగుదామంటే సరుపు అడ్డొస్తుంది. నా ఉరిలైన బట్టలు హోదా అడ్డొస్తాయి- సంఘి పై బడిన నా వయసు అడ్డొస్తుంది. "అవన్నీ నాకు తెలీదు- చాలా ఏళ్ళనుంచి ఈ వూళ్లో ఉంటున్నావు బిజినెస్ చేస్తున్నావు.. నీకు తెలీని పిల్ల ఎవరుంటుంది. ఆమెను తెస్తే నీ మామూలు ఫీజు కాకుండా అదనంగా వందిస్తాను" అన్నాను ఖాళీ గ్లాస్‌లోకి విస్కీ ఒంపుకుంటో-

'ఎగిరి నూర్లన్ని మొట్టకుంటే లక్ష రూపాయలిస్తాను' అన్న పందెం విన్నట్లు వెర్రిగా చూశాడు ఎల్లప్ప 'ఏం పిల్లలో సార్- నన్ను పుట్టినోళ్ళ తోటకూర కాడల్లా ఎదిగి రెండో రోజుకే పైటలేస్తున్నారు- ఎవరినిచెప్పను? కనీసం పేరైనా తెలీదాయె' నాకు సమాధానమివ్వలేక పోతున్నందుకు నొచ్చుకుంటో ఎల్లప్ప అందులో తనకు వంద దక్కే దక్క బాధే ఎక్కువ ఉండి ఉంటుంది. "భోజనం పై కి పంప మని చెప్పు- వెళ్ళు" ఎల్లప్ప అసమర్థత మీద కోపం అంతా చూపిస్తూ అన్నాను. ఎల్లప్పకు తెలుసు - ఏ సమయంలో ఏ మందు వాడాలో మెల్లగా లేచి బైటికెళ్ళి పోయాడు. 'బ్లడీ ఫెలో' - తిట్టుకున్నాను. ఆదోనిలోని నాల్గు బ్రోతల్ కంపెనీల్లో పేష్టున్నాను. ఎల్లప్పకు కొత్తగా బ్రోకర్ ఉద్యోగం చేపట్టే వాళ్ళందరికీ గురువు లాంటివాడు. మనిషి ఎంత వికృతంగా, మొరటుగా కన్పిస్తాడోనవర్తన కూడా అలాంటిదే అంటారు."పాతివ్రత్యం- పవిత్రతా" టీజాల్లాంటివి వల్లించే ఆడవాళ్ళను సైతం లొంగదీసి వ్యభిచారంలోకి దింపటంలో ఎల్లప్పది అందె వేసిన చెయ్యి.

కొత్తపిల్లల్ని కొనటం. అమ్మటం లాంటి వ్యాపారాలు కూడా చేస్తుంటాడని వినికిడి నేనెప్పుడూ అతని బిజినెస్ వ్యవహారాల్లో తల దూర్చలేదు. అతను నా బిజినెస్ వ్యవహారాల్లో ఎప్పుడూ ఆసక్తి చూపించలేదు కాబట్టి-

ఆడవాళ్ళపాలిట రాక్షసుడంటారు ఎల్లప్పని. కాని నాలాంటి వాళ్ళ పాలిట మాత్రం చాలా అవసరమైన వ్యక్తి.. గ్లాస్ విండోమీద బల్లి పురుగుల కోసం కాచుకుని కూర్చుంది... నేను కావాలనుకున్నది పొందకుండా ఇన్నేళ్ళ జీవితంలో ఎప్పుడూ నిద్రపోలేదు. అతి జాగ్రత్తగా బల్లి పురుగువైపు పాకు కదుల్తోంది. సగం మూతలబడే కళ్ళతో గ్లాస్ విండో వైపు ఆసక్తిగా చూస్తున్నా.. ఆ అమ్మాయిని పొందకుండా జీవితం వ్యర్థం.. బల్లి పురుగుని ఒక్క వుదుటున నోట కరచుకొంది...

❖ ❖ ❖ ❖

ఆంధ్రా కేఫ్‌దాటాక అకస్మాత్తుగా ఆగి పోయాయి కాళ్లు.. ఎన్నో ఏళ్ళ తరబడి వెతుకుతున్న వస్తువు కన్పించినట్లుగా మంత్రించినట్లు ఆగిపోయాను.

అంచులు చిరిగిన పావడా- పెద్దపూలున్న పరికిణీ- తెలుపురంగు జాకెట్ - గ్రీకు శిల్పాలకుండే శరీర సౌష్టవం.. బడ్డీ దగ్గర నిలబడి ఎల్లప్పతో మాట్లాడుతోంది.. మొదట ఆశ్చర్యపోయాను. ఎల్లప్పకి పిల్ల తెలుసా అని. తర్వాత రక్తనాళాల్లోకి అమృతం పొంగుతున్నంత హాయిగా ఫీల్ అయ్యాను. ఎన్నాళ్ళ కోరికో తీరబోతున్నందుకు. పక్కన కొలిగ్స్‌ని చూసి ఎల్లప్పను పిలవకుండా ఆగిపోయాను. ఎల్లాగూ తనవరో తెల్సిందిగా- రాత్రికి ఏకంగా రూంకే పిలిపించుకోవచ్చు. టెలిగ్రాఫ్ ఆఫీస్‌కెళ్ళి మరో రోజు వుండి పోవాల్సి వస్తుందని మా హెడ్ ఆఫీస్‌కి టెలిగ్రాం ఇచ్చాను. మామూలుకంటే ముందుగానే రూం కెళ్ళి పోయాను.

ఆ అమ్మాయి కళ్ళముందు కదులాడ్తోంది... రాక్షసు ధీకొంటోపాటే కొండనీరు గుర్తుకొస్తుంది ఆమెను తల్చు కుంటే- ఎల్లప్పకిటువంటి పనులు చెప్పుతో పెట్టిన విద్య లొంగని ఆడదాన్ని తెండుమక్కలా వంచేయగలడు. తన సర్వీసులో ఎంతమంది కన్నెపిల్లల్ని ఈ వృత్తిలోకి దింపేడో అదో పెద్ద అద్భుతంలా చెప్తాడు ఎల్లప్ప. "గున్న రాక్షసుండి నంటూ తిట్టింది సార్ ఒకతె" మురిసిపోతూ చెప్తాడు అదో బిరుదైనట్లు ఓ సారెవరో అమ్మాయి సీసాతో తల పగుల కొట్టిందట.. కుట్లు పడ్డాయట.. నుదురు చూపిస్తా.. పొగరు మోతు గుంటల్ని లొంగదీశాను ఇదో లెక్కా.. నాల్గు రోజులు కూడా నీళ్ళు ఇవ్వటం మానేస్తేనరి - కాళ్ళ బేరాని కొస్తారు" తల ఎగరవేస్తూ చెప్తాడు.. ఎలాగూ ఈ అమ్మాయి ఎల్లప్పకు తెల్సినదే కాబట్టి అంత కష్టపడాల్సిన అవసరం రాదనుకుంటా.

స్నానం పూర్తి చేసి టేబుల్ ఫ్యాన్ ముందు నైట్ వేసుకు కూచున్నా.. చాలా హాయిగా చల్లగా ఉంది. లోపల చాలా వేడిగా కోరిక బుసకొడుతోంది.

"సార్" ఎల్లప్ప తలుపుకొడ్తున్నాడు మెల్లిగా.

ఒక్క వుదుటునవెళ్ళి తలుపు తీశాను.

"నీ కోసమే చూస్తున్నా, త్వరగా రా లోపలికి"

తలుపు వేసి వచ్చి నిలబడ్డాడు

" ఆ అమ్మాయిని చూశానీరోజు"

"చూస్తే ఏం ప్రయోజనం సార్ అదెవత్తో తెలిస్తే కదా పని జరిగేది" అన్నాడు. లాభం లేదు. నీ వంద నాకు ప్రాప్తం లేదన్నట్టు

" నీకు తెలుసోయ్"

"నాకు తెలుసా?"

"అదే - ఈ రోజు సాయంత్రం ఆంధ్రా కేఫ్ పక్కన నీతో మాట్లాడుతూ నిలబడింది చూశావా పెద్ద పూల పరికిణీ- ఎర్ర బార్డర్ పావడా..

గుర్తొచ్చిందా అన్నట్టు చూశాను ఎల్లప్ప వైపు

ఎల్లప్పలో నేనెప్పుడూ చూడని మార్పు కొట్టిగా కనబడుతున్నాయి పెదవులు అదురుతున్నాయి.

మంచి కన్ను మొదట తడిసేరి- ఎండిన బుగ్గల్ని తడుపుతోంది."ఎల్లప్పా- ఒంట్లో బాగోలేదా" అంత మంచి సమయంలో కన్నీళ్ళు బాధలూ.. ఛీ" విరాకు నాకు. ఎల్లప్ప నిశ్శబ్దంగా వెనుదిరిగి పిలుస్తున్నా పట్టించుకోకుండా బైటికెళ్ళిపోయాడు.

రాస్కెల్ -ఏడిరెంత పొగరు?

రాత్రంతా నిద్రకోసం పోరాటం.. ఎల్లప్ప మీద కసిగా, కోపంగా ఉంది. వాడికేవో కష్టాలూ, కన్నీళ్ళూ ఉంటే వాటిని నా ఎదురుగా ఒలకబోయడం దేనికి? ఇడ్జీరేవర్.. నా ఆనందాన్ని పాడుచేశాడు. ఈసారి కన్పిస్తే తన్నాలన్నంత ఆవేశం నాలో...

ఉదయం కూడా ఎల్లప్పరాలేదు.

ఇంక అక్కడ ఉండాల్సిన అవసరం ఏమీ కన్పించ లేదు. రూంఖాళీని చేసి సామాను బస్టాండు వరకూ మోసుకురమ్మన్నాను బస్‌స్టాండ్ లాడ్జికి దగ్గరగా ఉంటుంది. మలుపు తిరుగుతున్నప్పుడు ఆ అమ్మాయిని రోడ్డుమీద నం "పడిగా నడుస్తూ చూశాను. అదే రంగు పావడా - పట్టాన్ని కప్పుతూ పూల పరికిణీ.. ఎల్లప్పను వంపేయాలన్నంత కోపం రాత్రి అలా వెళ్ళిపోయినందుకు.

ఆ అమ్మాయి తెలుసటగా నీకు అన్నాను సామాను మోస్తున్న కులాయితో వాడూ చూశాడు దూరంగా వెళ్తున్న ఆ అమ్మాయిని. "ఎందుకు తేలీదు సార్ - అట్లా ఎల్లప్ప కూతురు" అన్నాడు ఇంతదూరమాలో ప్రశ్నకు లభించిన జవాబు చెప్తున్నప్పుడు కలిగే ఆనందంతో పొంగుతూ.ఒక్క సారిగా - గుండె కొట్టుకోవడం - మెదడు పనిచేయడం- శ్వాస ఆగటం - అన్నీ ఆగిపోయినట్లనిపించింది.

ఎల్లప్పకి ఇంత అందమైన కూతురుందా? ఇంపాసిబుల్.. ఎల్లప్ప ఇవరయ్యేళ్ళనించీ తెల్సు నాకు అతనికి పెళ్ళైందాలేదు.. దూరపు బంధువనుకోడానికి కూడా వీల్లేదు. ఎప్పుడడిగినా "నాకెవరూ లేరు సార్ - చిన్నప్పుడే అమ్మా నాన్న పోయారు. ఆ తర్వాత ఎలా బ్రతుకుతాడో మీలాంటోళ్ళు వినలేరు సార్ అదంతా రోడ్డుకు అంకితమైన బతుకు అనే ఎల్లప్పకు కూతురా?

"నీ కెవరు చెప్పారా" అన్నాను ఉండేకన వృత్తం రాకుండా..

"మా ఇంటిదగ్గరే సార్ వాళ్ళిల్లు వసంతా టాకీస్‌దాటి కొంత దూరం పోయాక సారాకొట్టులేదూ దానికి మూడుగుడిశెలవతలే వాళ్ళిల్లు. ఆలోచిస్తూ. నడుస్తున్నా అదే నిజమైతే ఎల్లప్ప నాప్పుకొని వుంటాడు.

బస్టాండ్‌లో లగేజిపెట్టి ఆ అబ్బాయిని అక్కడే వుండమని చెప్పి వసంతా టాకీస్‌వైపు బయల్దేరాను.

వసంతా టాకీస్, సారాకొట్టు దాటాక.. అల్లుకుపోయిన్న గుడిశెలు.. ఒకటి, రెండు, మూడు అంటూ లెక్కపెట్టే ఎల్లప్ప ఇల్లు కనుక్కోడానికి అవి ఓ క్రమంలో లేవు. అటుగా వస్తున్న ఓ అబ్బాయినడిగాను. "అదే"నంతో నాపక్కనేవున్న ఇల్లు చూపించాడు.. మరీ గుడిశెలాలేదు. పైన పెంకులూ కింద అటుకట్టిన చక్కటి ఇంటిలావుంది బైట నిస్తారా లోపలికివెళ్ళి తలుపుతడుతో పిలిచాను.

అదే అమ్మాయి.. ఆ పెద్ద పెద్ద కళ్ళ అమ్మాయి- తలుపు కొద్దిగా తెరచి ఆశ్చర్యంతో అశ్చర్యంగా కళ్ళింతా పెద్దవిచేసుకొని చూస్తోంది.

"ఎల్లప్ప లేడా"

"లేడు - ఇంకో గంటదాటితే కానికొస్తాడు" ఇంకా కుతూహలంగా చూస్తోనే వుంది నావైపు.

ఏం మాట్లాడాలో తెలీలేదు

"ఏమన్నా పనా" కళ్ళు చక్రాలుతిప్పుతూ అడిగింది.

"ఏంలేదని" చెప్పి వెనక్కితిరిగాను అలా తిరిగేటప్పుడు చూశాను గోడమీద ఫోటోవైపు.

అనేకళ్ళ అల్పిప్పుల సమస్త విశ్వాన్ని తమలో ఇము డ్చుకోగల విశ్వాసం కురిపిస్తూ ఆ చిర్నవ్వు.. జ్ఞాపకాల పొరల్లో ఎక్కడో ఏదో మూల ఆ చిర్నవ్వు. ఒక్కసారిగా ఆ అమ్మాయి వైపు తిరిగాను తలుపునొదిలేసి నన్నతుని విస్మయంగా చూస్తోంది నావైపు. "ఆ ఫోటో" ఆగిపోయాను. మాట రావడం లేదు. "ఆ ఫోటో మా అమ్మది నేను పుట్టినప్పుడే చనిపోయిందట." ఇంకో క్షణం కూడా అక్కడ ఉండలేదు నేను పరుగులాంటి నడక.. ఆ ఫోటోనుంచి దూరంగా భయంతో పారిపోతున్నట్లు.. నడక నన్ను వెంటాడుతూ నా వెనకే ఆ విరిసిన ఒరస్ని ఏళ్ళనాటి మొట్టమొదటి సారి ఆ చిర్నవ్వు వింటూ ఆమె గొంతులో తాలాన్ని కరిగించాను.

ఆమె కమల...

'మొదటి బోణీ మీదే సార్' అంటే పెండ్లాంచిన్ని ఓ రాత్రికి కొన్ని కమల తనకేవని అప్పలేదంటూ వెక్కి వెక్కి ఏడుస్తుంది.. నేను ఇర్చానెనవచ్చుకు ప్రతిఫలం ఆశిస్తూ అన్నీ అబద్ధాలే చెప్పాను. ఎల్లప్ప పనిచేసే కంపెనీలో ఓ ఐజారు స్త్రీకి పుట్టిపెరిగిన కమల తనకూ పెళ్ళి చేసుకోవాలనుకుంటే మనసులో నవ్వుకున్నా పైకి "నేను పెళ్ళిచేసుకుంటానన్నాను" భర్తకు తప్ప మరొకరికి శరీరాన్ని ప్పర్చేసుంటే "ఈ క్షణంనుంచి నేనే నీభర్తనని భ్రమింపచేశాను. చివరికి బలవంతం- రభసా లేకుండా అతి మృదువుగా కమల లొంగిపోయింది రోజు స్త్రీ కొత్త కాకున్నా నాకా రాత్రి అన్నీ కొత్త - వింత అనుభూతుల్ని చ్చింది కమల. ఆ రోజుల్లో ఆదోని వెళ్ళినప్పుడల్లా ఎక్కువగా కమలే వస్తుండేది తరక్వాతాంటే ఎప్పుడూ ఓ రూపాయైనా అడగని కమలని పిలిపించుకోవడంలో డబ్బు ఆదా అవుతుందని సంబరపడుతూండేవాడిని.

ఓ రోజు తనూ నాతో వచ్చేస్తానంటూ పేచీ పెట్టింది. "నేనక్షణ క్షణం ఉండలేని ఆ ఎల్లప్ప ఎవరి దగ్గరికో పొమ్మంటాడు లేకపోతే తిండి పెట్టనంటాడు. చూడండి - బెల్టుతో ఎలా కొట్టాడో - ఒంటిమీద స్పష్టంగా కన్పిస్తున్న వాతలు చూపించింది.ఆ రాత్రి గుండెలమీద తల ఉంచి "నన్ను నరకం లోంచి తీసికెళ్లరూ" అంటూ కన్నీళ్ళతో ప్రాధేయపడింది. "చిన్నప్పటి నుంచీ అమ్మ తన పక్కన కూడా పెట్టుకుని చెప్తూ ఉండేది నేను తనలా కాకూడదని.. పెళ్ళి చేసుకుని హాయిగా కాపురం చేయాలనీ.. అందుకోసం తానెంత కష్టమైనా భరిస్తాననీ.. ఏమైనా చేస్తాననీ చివరికి ఏమీ చేయకుండానే నన్నొంటరిదాన్ని చేసి చనిపోయింది"

ఆ రాత్రంతా కమల ఎన్నో విషయాలు చెప్తూనే ఉంది. వాళ్ళమ్మ రోగాల్తోనే చచ్చిపోయిందట తన వృత్తి చేయకూడదని చివరి కోర్కెగా కోరిందట."మా అమ్మ కోర్కె తీర్చడానికి ఒకే ఒక ఆధారం మీరు. నన్నన్యాయం చేయరుగా" తన చెదల్చారి కళ్ళలోంచి నీరు ఉబుకుతుంటే ఎన్నిసార్లు చెప్పిందో.. కొన్నాళ్ళు ఎల్లప్పకు తెలిసిలా కొంత డబ్బిచ్చేవాడిని. కమల ఖర్చులకోసం. ఆ తర్వాత అనవసరం అన్పించింది. నిరంతరం వ్రైటీ కోరే నా మనసుకు కమల పాతబడిపోయింది.

ఒకటి రెండుసార్లు ఎల్లప్ప కమల విషయం చెప్పి "నాదు" అది మీతో తప్పితే ఎవ్వరి దగ్గరకూ పోనంటుంది సార్. కొట్టినా తిట్టినా సహిస్తుంది. చంపేసినా ఒప్పుకుంటానంటుంది సార్ కానీ వేరే వృత్తి ముఖం చూడనంటుంది. అటువంటిదాన్ని ఎప్పుడూ చూళ్ళేదు సార్" అంటూ

నేను చిరాకుపడేవాడిని.. గట్టిగా చెప్పాక సారి కమల విషయం ఎత్తడప్పని.

పాప పుట్టాక కమల ఆత్మహత్య చేసుకుందని తెల్సినప్పుడు కొన్ని క్షణాలు బాధపడ్డాను. నేను జీవితంలో బాధపడిన అతికొద్ది క్షణాల్లో ఆ క్షణాలు కొన్ని. "వాళ్ళమ్మ కోర్కె తీర్చింది సార్- జీవితంలో ఒకళ్ళే నమ్మకుంది" అంటూ ఆమెను పొగిడే ఎల్లప్ప నుంచీ కొన్నాళ్ళు తప్పించుకునే ప్రయత్నాలు చేశాను. ఆమె జ్ఞాపకాల్ని బలవంతంగా విదిలించుకున్నాను. సుఖపడటానికే జీవితం అని నమ్మేనాకు కమలను పూర్తిగా మర్చిపోవడానికి ఎక్కువ కాలం పట్టలేదు. మరలా ఇపుడు ఆ జ్ఞాపకాలు తరుముకుంటూ... బస్‌లో స్థిమితంగా కూచోలేకపోతున్నా బస్ కదిలి ఆదోని నుంచి కొన్ని పదుల మైళ్ళు దాటాక- మనసు కొంచెం స్థిమిత పడింది. కానీ ఆ సంఘటన నాలో పెద్ద మార్పేమీ తీసుకురాలేదు. సినిమాల్లోలా - కథల్లోలా ఆమెను నా కూతురంటూ దరిచేర్చి - పెళ్ళి చేయించలేను. డిగ్రీ చదువుతున్న నా కూతురూ ఆమె భవిష్యత్తూ, సంఘంలో నా పలుకుబడీ, గౌరవం.. ప్రాక్టికల్‌గా ఆలోచించడానికి అలవాటుపడ్డ నా మనసూ.. ఇవన్నీ గుర్తొచ్చి ఏవీ జరగనట్లే ప్రవర్తిస్తున్నాను. ఆదోనికెళ్ళే ప్రతీసారి ఎల్లప్ప కలవకున్నా నా "హాబీలు" నిరాటంకంగా సాగిపోతున్నాయి. బోల్డు బంగారు ఉంది నా ఫీల్డులో సహాయపడటానికి దేశంలో ఆ విషయంలో కొరత లేదు. ఎటొచ్చి నాలో ఒకే ఒక మార్పొచ్చింది. ఎల్లప్ప అందరూ అనుకునేట్లు రాక్షసుడు కాదని.. అతనిలో మానవత్వం మామూలు కన్నా కొద్దిగా ఎక్కువేనని నమ్మటం ప్రారంభించాను. ఇలా నమ్మటం వల్ల నాకేమి నష్టం కనిపించలేదు కాబట్టి.



ప్రతి సోమవారం

రైటర్స్ అకాడమీ

వారం వారం విపుల సాహిత్య విహారం

"మొజాయిక్ సాహిత్య పురస్కారం 2018"



సామాజిక స్పృహ అంటే సిద్ధాంతాలు చెప్పడం అని కాకుండా సజీవ పాత్రల ద్వారా కులం, మతం, విద్య, పెళ్లి తదితర జీవిత సమస్యలు, వాటిని పరిష్కరించుకోవడంలో పాత్రల ఓరిమి, ముస్లిం ప్రజల అంతర్గత ఆచార అవరోధాలు, దట్నా పై పిల్లల అమ్మకాలు, ప్రకృతి, పర్యావరణం, వైద్య రంగ దైన్యత, ఇలా సమకాలీన జీవితాన్ని శక్తివంతంగా నవలలు, కథలుగా చెప్తున్న సలీం "ప్రసన్న కథా కలితార్థ యుక్తి", ప్రస్తుతం తెలుగు నవలా, కథా సృజన కోనలో, ప్రత్యేకమైనది. ఆసియాలోనే ముస్లిం మహిళల జీవితాన్ని తొలి నవల వెండి మేఘం వెలువరించిన రచయితగా, సమాజ సమస్యలకు దర్పణమైన సాహిత్య సృజనను అందించడంలో సిద్ధహస్తుడుగా, ఆరోగ్య అత్యంత పరిస్థితి ఎయిడ్స్ పై నవలకు కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డ్, అలాగే, సుప్రీం కోర్ట్ జడ్జిలు సాయుధం తీర్పు ఇచ్చిన యుథానేషియా (స్వచ్ఛంద మరణ కాంక్ష) వంటి భిన్న అతివృత్తాలతో రాసిన పదిహేను నవలల్లో జీవన సమస్యలు వస్తువుగా, రూప పరిమితుల ఎరుకతో, తన దృక్పథము, తాత్విక ఉదార జీవన విలువల కలుపుగోలు నాగరికతగా, తొమ్మిది సంపుటాల కథల్లో ఆధునిక సమాజ జీవనంలో ఎదురవుతున్న జటిల, విషమ సంఘటనలకు కారణాలయ్యే పాత కొత్త మూఢత్వాలను కథల ద్వారా పట్టిస్తూ, సహజీవన నాగరికతా ప్రభావాన్ని సాహిత్యంలో పెంపొందిస్తున్న సార్వజనీనమైన ఆశావాదానికి అభినందనలతో, ముందు ముందు మరింత ప్రగాఢమైన మానవ సంస్కృతి చిత్రణ, భారతీయ రచయిత సయ్యద్ సలీం రచనల్లో మకుటాయమానంగా వెలుగొందాలని ఆకాంక్షిస్తూ, ఐహా పురస్కృత సృజన ప్రతిభా మూర్తి సలీం కు "మొజాయిక్ సాహిత్య పురస్కారం 2018" అందచేస్తున్నాము.



సాహిత్య భిన్నత్వ ఏకత్వ మొజాయిక్



మొజాయిక్ తొలి పురస్కారం పొందిన రచయిత

దశాబ్దంన్నరగా అక్షర పరిశోధనా శాలల్లో దాదాపు వంద ఋతువులు గడిపిన మొజాయిక్ తూర్పు పడమరల సాహిత్య సరస్వతిని ఎరుక పర్చడానికే సాధనలో ఉన్నది. సత్యం సాధకులకే గోచరించినా అందుకు తపస్సు వంటి శ్రద్ధ కూడిన ఉమ్మడి ఉద్యోగత తప్పదు. ప్రతి వేదిక మంచి దనూ కొత్త అర్థాలూ, ఆలోచనలు ప్రసాదిస్తూనే వచ్చింది మొజాయిక్ బృందానికి. చదువుతున్న పుస్తకం మందర ఎన్నో మాట్ల చదివిందే అయినా, లేదా అదృష్ట వశాత్తు సరికొత్తగా చదువుతున్నదే అయినా, ఒక సత్యం ఆ పద విన్యాసంలోంచి సాక్షాత్కరించేది.

"శ్రద్ధయా లభతే జ్ఞానం" మొజాయిక్ రచయితలు ప్రతి ఒక్కరి విషయంలో, నిజమని నిరూపణ జరిగింది. తద్వారా, అంతవరకూ తెలుగు లో అందుబాటులో లేని టి.ఎస్. ఇలియట్ "ద వేస్ట్ లాండ్" పూర్తి అనువాదం కొల్లూరి దాసు కొల్లడంతో మొదలైన ఈ సాధన, ఎలా ఇంత కాలం గడిచిందో తెలియకుండానే నడిచింది. గురజాడ నాటకంలో మధుర గురించి పుస్తకం తేవడం 'మధురంగురజాడ' తో మొదలు పెట్టి కొన్ని పదుల కొత్త కోణాల వ్యాసాలు, కన్యాశుల్కంలో పంచ తంత్ర పరిమళాలు, పర్వ తయ్య పై హాదుక మాటల వరద కన్యాశుల్కం, మళ్ళీ బండిలో కన్యాశుల్క దైత యాత్ర, శ్రీ శ్రీ కవిత్వం పై ఆలోచనాత్మక వ్యాసాలు చతుర్థక భువనాలు చతుర్దశ కవనాలు (ఒక ఏడాదిలో పద్నాలుగు మహా ప్రస్థాన కవితలు (శ్రీ శ్రీ రాసిన విషయం పై ఫోకస్) అయిన అనువాద పద్ధతుల పరిశీలన.వారు మహాప్రస్థాన గీతం రాసిన బర్మర్ వారి సత్రంలో శ్రీ శ్రీ అనుభవించిన ప్రపంచ కష్టం ఫోటో ఎగ్జిబిషన్, జోక్ కవిత మూల విధేయ అనువాదం, ఆరుద్ర శతజయంతి పై పవర్ పాయింట్ తో పాటు ప్రత్యేక వ్యాసాలు, రావి శాస్త్రి రత్నాలు రాంబాబులో కన్యాశుల్క ప్రభావాలు, జనగణమన నూరేళ్ళ పండుగ, విజయనగరం కోటకు మూడు వందలేళ్ళు, గురజాడ మాటయాత్ర, టాగోర్ 150, హీరోషిమా మరింత ప్రదర్శనలు, కార్టూన్ షోలు, కృష్ణశాస్త్రి మాట ఇరవై, నండూరి ఎంకి శతవత్సర సంబరాలు, పాండవోద్యోగ నాటక ధార రచన ముగింపుకి వందేళ్ళు (1917-2017) షేక్స్పియర్ నాలుగు వందల యాత్ర, మహాత్మా గాంధీ చంపారన్ ఉద్యమ వందేళ్ళ సందర్భం, యాభై ఏళ్ల దిగంబర కవిత్వం, మహోత్సవ సందర్భాల్లో శ్రీ శ్రీ గీతాలు, తొంభై ఏళ్ల ప్రభవ, భాస నాటక చక్రానికి భాసుర హారతి, చలం సుధ చిత్ర కవితల ప్రదర్శన, తొంభైల్లోకి మన కారా, ఉత్తరాంధ్ర స్థాయి కవి సమ్మేళనాలు, కన్యాశుల్కం 125 జాతీయోత్సవాలు మీటప్స్‌లో ఎల్.ఆర్. స్వామి, పేరం జయశీల రావు, జగద్ధాత్రి, డా. మాటూరి శ్రీనివాస్, గరి మెళ్ళ నాగేశ్వరరావు, పేరి రవికుమార్ పి. రాజేశ్ తదితరులు పాల్గొనడమే కాక, కార్యక్రమాల నిర్వహణలో సహకార భాగస్వామ్యం వహిస్తూ వచ్చారు. భారతీయ భాషల రచయితలు జగన్నాథ్ ప్రసాద్ దాస్,పుష్పప్రభ మహంతి, గౌర హరి దాస్, వైప్రా రాధాకృష్ణన్, కృష్ణ బోస్, కుట్టి రేవతి, అమిత్ దహియా బాద్షా, కె. సచ్చిదానందన్, సేతు, జె.పి. దైవ్య, పెంటమూర్ గురుమూర్తి, తదితరులు మొజాయిక్ సభల్లో పాల్గొని సాహిత్య దృష్టిని పరివ్యాప్తం చేశారు.

సభ్యుల ప్రముఖంగా తెలుగు, మలయాళం, ఆంగ్లం, హిందీ, భాషల్లో సంబ్లై పైగా పుస్తకాలు, సంగీత ఆల్బమ్‌లు, పదుల సంఖ్యలో సాహిత్య, సామాజిక అంశాలపై పవర్ పాయింట్ నిర్మాణాలు, చిత్రప్రదర్శనలు, గురజాడ, శ్రీ శ్రీ, రావి శాస్త్రి లపై రేడియో శ్రవ్య రూపాలు, బాలలచే రంగస్థలాన గురజాడ సప్తర్ హాస్య నాటికలు, భక్కముడి రామ్మూర్తి చే శివన్న చెప్పిన రహస్యం శ్రీ శ్రీ రేడియో నాటికకు తొలిసారి రంగానుసరణ, వంగపండు చే కన్యాశుల్కం జానపదం ఇలా 'అభివ్యక్తి భిన్నరూపాల మొజాయిక్' ఆవిష్కృతం అయ్యింది. రేడియో, టి.వీల్లో రచనలు, ప్రసంగాలు ప్రసారం జరిగాయి. సభ్యులు ప్రాంతీయ, రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డ్‌లు తమ సాహిత్య కృషికై పొందారు. ఇదే సాహిత్య ప్రోత్సాహక స్ఫూర్తి రచయితల సమాజానికి అందచేసేందుకు మొజాయిక్, సాహిత్యసురభి, ఋత్విక్ ఫౌండేషన్లతో సంయుక్తంగా అక్షరగోదావరి వార్షిక అవార్డులుగత మూడేళ్ళుగా,మొదటిసారిగా ఒకేవేదికపై కవి, కథకుడు, విమర్శకుడు/ పరిశోధకుడు ముగ్గురను, గౌరవిస్తూ వస్తున్నది.

సాహిత్య సామాజిక సాంస్కృతిక అంశాలపై వందల వ్యాసాలు తెలుగు, ఆంగ్ల మలయాళ భాషల్లో ప్రచురణ జరిగిన ఏకైక సంస్థ మొజాయిక్. వంద మందిపైగా తెలుగు కవుల / కథకుల రచనల ఆంగ్లానువాదాలు, అలాగే హిందీ, ఇంగ్లీష్, బెంగాలీ, ఒడియా, మలయాళం, తమిళం, ఉర్దూ భాషల నుంచి తెలుగు అనువాదాలు చేయగల వైదుష్యాలు గల ప్రత్యేక సంస్థగా కూడా మొజాయిక్ గుర్తింపు తెచ్చుకుంది. గురజాడ కథలు, శ్రీ శ్రీ మహాప్రస్థానం, ఇంకా కృష్ణ శాస్త్రి శివారెడ్డి , దేవీప్రియ, నగ్నముని, నిఖిలేశ్వర్, ఎన్. గోపి, శివశంకర్, త్రిపుర, కొప్పర్తి, శిఖామణి, దాట్ల దేవదానం రాజు, విజయచంద్ర, ఎండ్లూరి సుధాకర్, మందరపు హైమవతి, తురిమెళ్ల విల్సన్ సుధాకర్, ముద్దా శ్రీనివాస రావు,చింతకింది శ్రీనివాస రావు, ఎందరో కవుల,కథకుల మొజాయిక్ బృందం స్వామి, రామతీర్థ, జగద్ధాత్రి నుంచి అనువాదాలను అందుకున్నారు. పలు రాష్ట్రాల్లో సాహిత్య సౌహార్దయాత్రలు, ప్రసంగాలు చేశారు. పదిహేనేళ్ళ కృషి, ఏర్పరచిన బౌద్ధిక పునాదులపై, ఐహిక ఆచరణల భారతీయ వేదికగా, మొజాయిక్ ఈ ఏడాది నుంచి మొజాయిక్ సాహిత్య పురస్కారాన్ని ప్రకటిస్తున్నది. ఈ తొలి పురస్కారం, సమకాలీన జీవితాన్ని స్పృశనసంపన్నం చేసే శ్రద్ధ, నిష్ఠత, గుర్తింపు గల కథా నవలా రచయిత సయ్యద్ సలీమ్ కు మార్చ్ 24 సాయంత్రం పెద్దల చేతుల మీదుగా ప్రదానం చేస్తూ, వారి సాహిత్యం పై పన్నెండు గంటల ఫోకస్ ' ఇషక్ -ఏ- సలీం' పేరిట 25 మార్చ్ ఆదివారం సభగా నిర్వహిస్తున్నది. కొత్త రాష్ట్రంలో గల సాహిత్య సాంస్కృతిక భాషా సంబంధ అవసరాల దృష్ట్యా సాహిత్య సామాజిక పాత్రను, సాంకేతిక నైపుణ్యాలతో కూడిన పద్ధతులతో, తరాల మధ్య భావ సమగ్రతా నిర్మాణ దిశగా, అడుగులు వేస్తూ, తెలుగుప్రజల శుభాకాంక్షలను, పెద్దల ఆశీస్సులను కోరుతున్నది.

-రామతీర్థ

(ప్రధాన కార్యదర్శి - 98492 00385)

సందలన వార్తా పత్రిక
లీడర్
విశాఖపట్నం
సోమవారం 26-3-2018

5 కోట్లకు చేరిన నయన్ మార్కెట్?

తమిళంతో పాటు తెలుగులో కూడా మలయాళ బ్యూటీ నయనతార నటించిన కర్తవ్యం హిట్ కావడంతో ఆమెను లేడీ సూపర్ స్టార్ అంటూ అభిమానులు పొగిడేస్తోన్న సంగతి తెలిసిందే. తమిళంతో పాటు తెలుగు మలయాళంలో కూడా నయనతారకు మంచి డిమాండ్ ఏర్పడింది. వాస్తవానికి - శ్రీరామరాజ్యం సినిమా తర్వాత కెరీర్ కు గుడ్ బై చెప్పేదామనుకున్న నయన తార....ఆ తర్వాత పరిణామాల నేపథ్యంలో మళ్లీ రీ ఎంట్రీ ఇచ్చింది. రీ ఎంట్రీ ఇచ్చిన తర్వాత నయనతార వరుస హిట్లతో దూసుకుపోతోంది. కొద్ది రోజుల క్రితం వరకు సినిమాకు రూ.2 నుంచి రూ.3 కోట్ల వరకు రెమ్యున రేషన్ ను నయన్ డిమాండ్ చేసింది. తాజా సమాచారం ప్రకారం నయన్...ఓ సినిమాకు రూ.5 కోట్ల వరకు పారితోషకం అందుకుందని ఓ తమిళ నిర్మాత వెల్లడించినట్లు తెలుస్తోంది.

అంతా రామమయం..





సీతారాముల కళ్యాణోత్సవం ఆదివారం వాడవాడలా కన్నుల పండువగా నిర్వహించారు. అధికారికంగా అంబికాబాగ్ వద్ద సీతారాములకళ్యాణం అంగరంగవైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాజకీయప్రముఖులు, జిల్లా అధికారులు, పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.





ఆదివారం రామాలయంలో..



22వ వార్డులో..





-న్యూస్‌లీడర్, విశాఖపట్నం

ఎన్టీఆర్ వైద్యాలయంలో
పోస్టుల భర్తీ సీఎంకి వినతి

- గొడారి ఆనకట్టకు రూ.36కోట్లు మంజూరు
- ఎమ్మెల్యే పీలా, పార్టీ ప్రధాన కార్యదర్శి జగదీష్



సీఎం చంద్రబాబుకు సమస్యను వివరిస్తున్న ఎమ్మెల్యే పీలా, జగదీశ్

అనకాపల్లి, న్యూస్‌లీడర్ : ఎన్టీఆర్ వైద్యాలయంలో వైద్యులు, సిబ్బంది పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుం టానని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ తెలిపారు. అమరావతిలోని శాసన సభ ఆవరణలో సీఎం ఛాంబర్‌లో ఎమ్మెల్యే పీలాతో పాటు తెలుగుదేశంపార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు కలిసి అనకాపల్లి నియోజకవర్గంలో గల పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వైద్యాలయంలో వైద్యులు పోస్టులు, సిబ్బంది విషయమై ముఖ్యమంత్రికి వివరించగా సానుకూ లంగా స్పందించారని చెప్పారు. గొడారి ఆనకట్టకు 36కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేస్తానని సీఎం హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే పీలా తెలిపారు. పార్టీ ప్రధాన కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు మాట్లాడుతూ నామినేటెడ్ పోస్టులు భర్తీ విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లగా అందుకు సానుకూలంగా స్పందించారని, త్వరలో భర్తీ చేస్తామని చెప్పినట్లు ఆయన తెలిపారు. పార్టీ ప్రధాన కార్యదర్శిగా జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు శక్తివంచనలేకుండా కృషి చేస్తున్నందుకు జగదీష్‌ను అభినందించారు. వచ్చే ఎన్నికలలో విశాఖజిల్లాలో తెలుగుదేశంపార్టీ విజయానికి మరింత కృషి చేసి పార్టీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలలో తీసుకెళ్లి వచ్చే ఎన్నికల్లో పార్టీని ఘనం విజయం సాధించే విధంగా కృషి చేస్తామని ఈ సందర్భంగా జగదీష్ సీఎం చంద్రబాబుకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత నాయకులు మలసాల కుమార్‌రాజా తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానేంద్రియాల్లో నయనం ప్రధానం

బ్రాండిక్స్ భారతీయ భాగస్వామి దొరైస్వామి కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



అచ్యుతాపురం, న్యూస్‌లీడర్: జ్ఞానేంద్రి యాల్లో నయనం ప్రధానమని ప్రతిఒక్కరూ కంటి విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవా లన్నారు. ఆదివారం అచ్చుతాపురం ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో బ్రాండిక్స్ ఆధ్వర్యం లో కంటి వైద్య శిభిరం ఏర్పాటుచేశారు. కాకినాడ శంకర్ ఫౌండేషన్‌కు చెందిన శ్రీకిరణ్ కంటి ఆసుపత్రి వైద్యులు ఈకంటి పరీక్షలు నిర్వహించారు. ముఖ్యఅతిధిగా విచ్చేసిన ఆయన కార్యక్రమాన్ని ప్రారంభిం చిన అనంతరం మాట్లాడుతూ అవసరమైన ప్రతిఒక్కరూ ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉచితంగా కంటిప రీక్షలు నిర్వహించి కళ్ళజోళ్ళు ఉచితం గా పంపిణీ చేస్తున్నామన్నారు. శస్త్ర చికిత్స అవసరమైన వారిని తమ స్వంత వాహ నాల్లో తీసుకెళ్ళి ఆపరేషన్లు చేయించనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకూ 30 వైద్యశిభిరాలు ఘనంగా నిర్వహించామని, ఈ31 వ శిభిరం సేవలు కూడా స్థానికులంతా వినియోగిం చుకోవాల న్నారు. శంకర్ ఫౌండేషన్ ద్వారా దాదాపుగా లక్ష మందికి జీవితాల్లో వెలుగు ఇచ్చా మన్నారు. వైద్య శిబిరాలు నిర్వహించడం తోపాటు పేదలకు సేవలందించడంలో బ్రాండిక్స్ ముందుంటుందన్నారు. స్థానిక ప్రజలందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధిక సంఖ్యలో కంటిపరీక్షలకు వచ్చిన ప్రజలు పాల్గొన్నారు.

బాలల శ్రీరామ నవమి వేడుకలు



విశాఖపట్నం, న్యూస్ లీడర్: దైవ స్వరూపుడైన శ్రీరాముని వివాహం వేడుకలు మాదవధార కళింగనగర్‌లోని శ్రీ ముఖి పాఠశాల సమీపంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు గొండు శీతారాం పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాలలే పెద్దలుగా వ్యవహరించి, శ్రీరామును వివాహం క్రతువని కనులారా చేయడం శుభపరిణామం. విళంబినామ సంవత్సరంలో రాష్ట్రంలోని బాలలందరికీ ఆయురారోగ్యాలు, కల్పించి అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేలా సీతారాములు ఆశీస్సులందించాలని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాలలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

Printed, Published and Owned by V.V.Ramana Murthy and Printed at LEADER PRESS, 58-14-109/5, Block No. 113 A, VUDA Layout, Marripalem, Visakhapatnam - 530009, A.P. and Published at 47-10-7/3, Diamond Park Junction, Visakhapatnam - 530016, A.P.
EDITOR - V.V. RAMANA MURTHY, **RNI NO: 72163/99, Registered Postal Regd. No. - VSP/211/2015-17 E-MAIL andhraleader@gmail.com, Telephone Nos. 0891-6660599, 98488 49832**